ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

చిత్తూరు

జిల్లా వార్తలు

శుక్రవారం 12 జూలై 2024



శేషాచలం అడవుల్లో పెద్దపులులు ఉన్నాయా?

వందేళ్లుగా ఈ కొండల్లో కనిపించని పెద్దపులి జాడ 2018లో కనిపించింది. ఆ తర్వాత ఎక్కడా వాటి ఆనవాళ్లు లేవు. దీంతో శేషాచలంలో పెద్దపులులు ఉన్నాయా, లేవా అనే విషయంలో అటవీశాఖకు కూడా స్పష్టత లేదు. తాజాగా పొరుగునే ఉన్న నెల్లూరు జిల్లా ఆత్మకూరు రేంజ్ పరిధిలో రెండు పెద్దపులులు ఉన్నట్టు నిర్ధారణ కావడంతో శేషాచలంలోకి పెద్దపులుల రాక ఇంకెంతో దూరంలో లేదని భావిస్తున్నారు. నిజానికి పెద్దపులి కోసం శేషాచలం చాలా కాలంగా ఎదురు చూస్తోంది.

ఎర్రదొంగలకు దడ

శేషాచలం అడవుల్లోకి పెద్దపులి అడుగుపెడితే ఎర్రచందనం స్మగ్లర్లకు దడ మొదలవుతుంది. ప్రస్తుతం ఈ అడవిలో చిరుతపులులు మాత్రమే ఉన్నాయి. ఇవి గుంపులుగా ఉన్న మనుషులను చూసినా.. తిరగబడ్డా భయంతో పారిపోతాయి. పెద్దపులి మనిషికి భయపడదు. దీన్ని ఎదుర్కోవడం ప్రాణాలకు తెగించడమే. ఎర్రచందనం కోసం రాత్రిళ్లు అడవుల్లో యథేచ్ఛగా తిరగడం సాధ్యం కాదు. అయితే ఎర్ర స్మగ్లర్ల వల్ల పెద్దపులికి కూడా ముప్పు ఉంటుంది. చిరుతల్లా బెదరగొట్టి తరిమేయలేరు గనుక వీటిని విషాహారం పెట్టిగానీ, తుపాకులతో కాల్చేయడం గానీ చేసే ప్రమాదం ఉంది.

జీవవైవిధ్యం

పెద్దపులి వల్ల శేషాచలంలో జీవవైవిధ్యం సమతూకంలో ఉండే ప్రయోజనం ఉంది. అడవి పందులు, జింకలు, కణితలు, దుప్పులు వంటివి ఈ అడవుల్లో ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయాయి. ఇవి పెద్ద వృక్షాల జోలికి వెళ్లవుగానీ చిన్న మొక్కల్ని తినేస్తుంటాయి. ఒకవైపు ఎర్రచందనం స్మగ్లర్లు అడవిని నరికేస్తూ ఉంటే, కొత్త చెట్లు పెద్దవి కాకముందే శాఖాహార జంతువులకు ఆహారంగా మారిపోతున్నాయి. చిరుతలకు అవసరమైన ఆహారానికి మించిన సంఖ్యలో ఇవి పెరిగిపోయాయి. పెద్దపులి మాత్రమే వీటి సంఖ్యను కట్టడి చేయగలుగుతుంది. ఒకసారి వేటాడితే 50 కిలోల మాంసం ఆహారంగా తీసుకుంటుంది. పైగా వెయ్యి కిలోమీటర్ల పరిధిలో ఇది వేటసాగిస్తుంది.

- శేషాచలం సమీపంలో సంచరిస్తున్న పెద్దపులి
- లంకమలలో 9, వెలుగొండ అడవుల్లో 2 పులులు
- త్వరలోనే అడుగుపెడుతుందని అంచనా

కథనం

తిరుపతి (మంగళం)

పులిరాజుకు స్వాగతం!

బ్రిటీష్ పాలనా కాలంలో మామండూరు అటవీప్రాంతంలో కిస్నెల్ అండ్రోసన్ అనే దొర పెద్దపులిని వేటాడి చంపినట్లు మామండూరు అటవీకార్యాలయ రికార్డుల్లో నమోదై ఉంది. ఆ తర్వాత ఇప్పటిదాకా వీటి జాడ లేదు. నల్లమలలో మాత్రం పెద్దపులుల సంఖ్య పెరుగుతూ ఉంది. నాగార్జునసాగర్ శ్రీశైలం టైగర్ రిజర్వ్‌లో ప్రస్తుతం దాదాపు 80 వరకు పెద్దపులులు ఉన్నాయి. వీటి సంఖ్య నల్లమలలో పెరిగేకొద్దీ ఇతర ప్రాంతాలకు విస్తరిస్తాయి. ఈ విస్తరణ వందల కిలోమీటర్లు ఉంటుంది. పెద్దపులులు సమూహాలుగా జీవించవు. ఒంటరిగానే ఉంటాయి. వీటి ఆవాసాలు దూరదూరంగా ఉంటాయి.ఒక పులి ఆవాసానికి కనీసం 50 కిలోమీటర్ల ఆవల మాత్రమే మరొక పులి ఆవాసం ఉంటుంది. ఒక్కోసారి వీటి నివాస పరిధి వెయ్యి కిలోమీటర్ల దాకా కూడా ఉంటుంది. అందుకే నల్లమలలో సంతతి పెరిగేకొద్దీ వీటి ఆవాస పరిధి కూడా విస్తరించక తప్పదు.

ఇదీ.. పెద్దపులికి రాదారి!

దీనిని గుర్తించిన అటవీశాఖ నల్లమల నుంచి శేషాచలం దాకా పెద్దపులుల కారిడార్ అని ప్రకటించింది. నాగార్జునసాగర్, శ్రీశైలం టైగర్ రిజర్వ్ ఫారెస్టు నుంచి శేషాచలం రిజర్వ్‌ఫారెస్టులోకి లంకమల మీదుగా చేరుకోవచ్చు. మొత్తం అటవీ ప్రాంతమే. ఇప్పటికే వీటి ప్రయాణం మొదలైంది. పెద్దపులులు నాగార్జునసాగర్ శ్రీశైలం టైగర్ రిజర్వ్ (ఎస్ఎస్‌టీఆర్) నుంచి గుండ్ల బ్రహ్మేశ్వరం టైగర్ రిజర్వ్ (జీబీఎం) ఫారెస్ట్ మీదుగా లంకమల శాంక్చురీలోకి చేరుకుంటున్నాయి. ఈ విధంగా ఇప్పటికే లంకమల లోకి తొమ్మిది పులులు ప్రవేశించాయి. వీటి ఉనికిని అధికారులు గుర్తించారు. ఇక లంకమలకు అనుకుని రెండు కారిడార్లు వెళతాయి. ఒకటి కడప జిల్లా శేషాచలం అడవులు అయితే మరొకటి నెల్లూరు జిల్లా పెనుశిల నరసింహస్వామి శాంక్చురీ (పీఎన్ఎస్). కొద్ది రోజుల కిందట నెల్లూరు జిల్లా అటవీ ప్రాంతంలో కనిపించిన పెద్దపులులు ఈ కారిడార్ మీదుగా వచ్చినవేనని అటవీశాఖ అధికారులు నిర్ధారించారు. మర్రిపాడు ప్రాంతంలో ఒక మగపులి ఆనవాలు ఇటీవల కనిపించింది. ఉదయగిరి, రాపూరు, ఆత్మకూరు ప్రాంతాల్లో రెండేళ్లుగా ఒక ఆడపులి తిరుగుతోంది.



నల్లమల అటవీప్రాంతం నుంచి శేషాచల అటవీప్రాంతం వరకు టైగర్ కారిడార్ మ్యాప్

అనువైన అడవి శేషాచలం

ఇక మిగిలింది శేషాచలం మాత్రమే. లంకమలకు అనుకుని ఉన్న కడప జిల్లా పరిధిలోని శేషాచలం అడవుల్లోకి పెద్దపులి రాకపోకలకు పెద్దగా అవరోధం ఏమీ లేదు. 2018లో శేషాచలం పరిధిలోకి అడుగుపెట్టిన పెద్దపులి బహుశా ఆ తర్వాత మళ్లీ వెనుదిరిగి ఉండాలి. అయినా వాటి రాజమార్గం వాటికి ఉంది కాబట్టి అతి త్వరలోనే శేషాచలం అడవుల్లో పెద్దపులి అడుగుపెడుతుందని అటవీశాఖ అంచనా వేస్తోంది. శేషాచల కారిడార్‌లోకి పెద్దపులులు ప్రవేశిస్తే వాటి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. వాటికి అవసరమైన ఆహారం, ఆవాసం ఇక్కడ పుష్కలంగా ఉన్నాయని అటవీశాఖ అధికారులు తెలిపారు.పెద్దపులులు మరీ దట్టమైన అడవిలో ఉండవు. ఇక్కడ అడవులు చెట్లతో చదునుగా, చిన్న చిన్న ఎత్తుపల్లాలతో ఉంటాయి. రాతి గుహలుంటాయి. పులులకు అవసరమైన ఆహారం.. జింకలు, దుప్పులు, కొండగొర్రెలు, అడవిపందులు భారీ సంఖ్యలో శేషాచలంలో ఉన్నాయి. వీటితో పాటు నీటి వనరులు కూడా ఎక్కువే. ఒకసారి ఆవాసం ఏర్పాటు చేసుకుంటే చాలు సంతతి పెంచుకుంటూ ఆవాసాలను విస్తరించుకుంటాయి.

భక్తుల భద్రతకు ఓవర్‌పాస్

పెద్దపులి వల్ల తిరుమల కొండకు వచ్చే భక్తులకు ముప్పులేకుండా తగిన భద్రతా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.అలిపిరి నడక దారిలో ఏడో మైలు ప్రాంతంలో దట్టమైన అడవి ఉంటుంది. చిరుతల బెడద లేకుండా ఏడవ మైలు నుంచి లక్ష్మీనరసింహస్వామి టెంపుల్ వరకు ఓవర్‌పాస్ ఏర్పాటు చేయాలని వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా నిపుణుల బృందం ఇప్పటికే టీటీడీకి సూచించింది. ఈ ఏర్పాటు చేస్తే పెద్ద పులి వల్లే కాదు, చిరుతలు, ఎలుగుబంట్ల ముప్పు కూడా భక్తులకు దాదాపుగా ఉండదు.

శేషాచలంలో వెతుకుతున్నాం

లంకమల అభయారణ్యం సమీపంలో.. శేషాచల అటవీప్రాంతంలో 2018లో కనిపించిన పెద్దపుల్లి ఆనవాళ్లు ఆ తర్వాత ఇప్పటిదాకా లేవు గానీ ఈ దిశగా శేషాచల అడవుల్లో తగిన అధ్యయనం జరగలేదు.ఇప్పుడిప్పుడే ఈదిశగా అడుగులు పడుతున్నాయి.ఈ పరిశీలన తర్వాతే శేషాచలంలో పెద్దపులి ఉందా, లేదా అనే నిర్ధారణ జరుగుతుంది.

- రమేష్, బయాలజిస్టు, నాగార్జునసాగర్, శ్రీశైలం టైగర్ రిజర్వ్



కుప్పంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయనున్న స్థలం ఇదే



ఎస్ఆర్‌పురంలోని 'విండో' కార్యాలయం

అక్రమాలకు 'సింగిల్ విండో'!

- పలుచోట్ల రుణాల దుర్వినియోగం
- పోలింగ్‌కు ముందు ఐదు బ్రాంచుల్లో రూ.20 కోట్ల అందజేత
- ఉమ్మడి జిల్లాలో త్రిసభ్య కమిటీల ఇష్టారాజ్యం

సహకార వ్యవస్థలో సంస్కరణలను తీసుకొచ్చాం. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు (సింగిల్ విండోలు) త్రీమెన్ కమిటీ వేశాం. అవన్నీ చక్కగా పని చేస్తున్నాయి.

- వైసీపీ ప్రభుత్వంలో తీసుకున్న ఈ చర్యలపై మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పిన మాట ఇది. కానీ, క్షేత్రస్థాయికి వచ్చేసరికి చాలావరకు ఆ త్రీమెన్ కమిటీలు సింగిల్ విండోలను అవినీతిమయంగా మార్చేశాయి.

- చిత్తూరు కలెక్టరేట్

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మంత్రి పెద్దిరెడ్డి సూచించిన వారితో 76 సింగిల్ విండోలకు త్రిసభ్య కమిటీలు వేశారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఈ కమిటీల పదవీకాలాన్ని ప్రభుత్వం పెంచుకుంటూ పోయింది. ఈ ఐదేళ్ల కాలంలో ఈ కమిటీలు ఇష్టారాజ్యంగా వ్యవహరించాయి.అదే సమయంలో తమ అక్రమాలు వెలుగు చూడకుండానూ మ్యానేజ్ చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో సింగిల్ విండోల్లో జరిగిన అవినీతి లీలలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి.ఉమ్మడి జిల్లాలోని 76సింగిల్ విండోల్లో చాలావరకు అక్రమాల పుట్టగా తయారయ్యాయి. ఆయా విండోల పాలకవర్గాలు, వాటి సీఈవో (సెక్రటరీ)లు కుమ్మక్కై దండుకున్నారన్న ఆరోపణలున్నాయి.

జేఎల్‌జీ రుణాలు పక్కదారి

జాయింట్ లయబులిటీ గ్రూపు (జేఎల్‌జీ) కింద ఐదు మంది ఉన్న బృందానికి ఒక్కొక్కరికి రూ.50 వేల వంతున మొత్తం రూ.2.50 లక్షల రుణం డీసీసీబీ ఇస్తుంది. ఇలా 2020-21, 2021-22 సంవత్సరాల్లో ఉమ్మడి జిల్లాలో 25కుపైగా విండోలు జేఎల్‌జీ రుణాలను ఇచ్చాయి. 2019-20 వరకు డీసీసీబీ ద్వారా జేఎల్‌జీ రుణాల పంపిణీ జరగ్గా.. అప్పటి మంత్రి పెద్దిరెడ్డి చెప్పారంటూ 2020-22 సంవత్సరాల్లో వైసీపీకి చెందిన చోటా నాయకులు, కార్యకర్తలకే రుణాలిచ్చారు. తీసుకున్న రుణాలను ఈ సొసైటీలు డీసీసీబీకి ఒక్కపైసా కూడా చెల్లించలేదు. రైతుల పేరిట ఇచ్చామంటూ విండోల త్రిసభ్య కమిటీ పాలకవర్గాలు రూ.కోట్ల రుణాలను పక్కదారి పట్టించాయి. విండోల వారీగా.. ప్రస్తుత చిత్తూరు జిల్లాలోని బైరెడ్డిపల్లెలో రూ.1.60 కోట్లు, పలమనేరులో రూ.25లక్షలు, కార్వేటినగరంలో రూ.10 లక్షలు, ఎస్ఆర్‌పురంలో రూ.20 లక్షలు, బయ్యప్పగారిపల్లె (పలమనేరు)లో రూ.50 లక్షలు, తిరుపతి జిల్లాలోని కాటూరు (శ్రీకాళహస్తి) రూ.10 లక్షలు, నారాయణవనం రూ.30 లక్షల మేరకు పక్కదారి పట్టాయి. అన్ని సింగిల్ విండోల్లోనూ విచారణ జరిపితే మరిన్ని అక్రమాలు వెలుగు చూస్తాయి.

డీసీసీబీలో దా'రుణాలు'పై అధికారుల సీరియస్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ)లో నిబంధనలకు విరుద్ధంగా జరిగిన రుణాలు పంపిణీపై కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ పి. శ్రీనివాసులు సీరియస్ అయ్యారు. మరోవైపు దీనిపై విచారించి నివేదిక ఇవ్వాలని జిల్లా సహకారశాఖ అధికారి నాగవర్ధన ఆదేశించారు. బ్యాంకు అధికారులు, గత పాలకవర్గ సభ్యులు కలిసి అన్ని రకాల రుణాల మంజూర్లలో అవకతవకలకు పాల్పడటంపై 'డీసీసీబీలో దా'రుణాలు" శీర్షికన గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం ప్రకంపనలు సృష్టించింది. ఈ వ్యవహారం గురించి తెలుసుకునేందుకు కలెక్టర్, జేసీల నుంచి అందిన ఆదేశాలతో శుక్రవారం బ్యాంకు సీఈవో మనోహర్‌గౌడ్ వారికి వివరణ ఇవ్వనున్నట్లు తెలిసింది. ఈ ఘటనకు సంబంధించి విచారించి పూర్తి వివరాలు అందజేయాలని చిత్తూరు డీఎల్‌సీవో వనజను జిల్లా సహకారశాఖ అధికారి ఆదేశించారు. ఇక, విజయవాడలోని నాబార్డు యంత్రాంగం సీరియస్ అయింది. పూర్తి వివరాలు ఇవ్వాలని నాబార్డు డీడీఎం సునీల్‌ను ఆదేశించింది.

పర్యవేక్షణ లేక..

రుణాలు పొందిన బృంద సభ్యులు తాము తీసుకున్న మొత్తాన్ని సింగిల్ విండోలకు చెల్లిస్తున్నారో లేదో పర్యవేక్షించేందుకు డీసీసీబీ సూపర్‌వైజర్లు ఉన్నారు. వారి నిర్లక్ష్యం కారణంగా విండోల్లో జమ అయిన జేఎల్‌జీ రుణాలు డీసీసీబీలకు చెల్లించకుండా స్వాహా చేశారు. అయితే వందశాతం రికవరీ జరిగిందని ఓవర్ డ్యూస్ ఏమి లేదంటూ ఇటీవల ఆప్కాబ్, ఆర్‌బీఐలకు డీసీసీబీ పంపిన నివేదికలో పేర్కొంది. విండోల్లోని పుస్తకాలు, జప్తు చేసి సమగ్ర విచారణ చేస్తే స్వాహా చేసిన మొత్తాలు బయటపడతాయి.



పలమనేరులో అద్దె భవనంలో ఉన్న కార్యాలయం

పెట్రోల్ బంకు నిర్వహణ పేరిట..

సహకార సంఘాల అభివృద్ధి పేరుతో జిల్లాలో మూడు సింగిల్ విండోలు పెట్రోల్ బంకుల్ని నిర్వహిస్తున్నాయి. పర్యవేక్షణ లేక ఈ మూడు చోట్ల పెద్ద ఎత్తున నిధుల దుర్వినియోగం జరిగినట్లు ఆరోపణలున్నాయి. సహకార శాఖ అధికారులకు అన్నీ తెలిసినా పెద్దిరెడ్డి భయంతో వాటిని ఇన్నాళ్లు చూసీచూడనట్లు వదిలేశారని సమాచారం. బయ్యప్పగారిపల్లె, రొంపిచెర్ల పెట్రోల్ బంకుల్లో రూ.20 లక్షలు చొప్పున, నగరి బంకులో రూ.25 లక్షల వరకు నిధుల దుర్వినియోగం జరిగినట్లు సమాచారం. ఈ విషయం తెలిసినా.. ఆ బంకులకు నోటీసులు ఇచ్చేందుకు కూడా సహకార శాఖ ధైర్యం చేయలేదు. పలు విండోలకు గోదాముల నిర్వహణ, మరమ్మతులు, షాపింగ్ కాంప్లెక్సు, ప్రహరీల నిర్మాణాల పేరుతో పెద్ద ఎత్తున నిధులు మంజూరయ్యాయి. అన్ని పనులు నాసిరకంగా జరగడంతో పాటు నిధుల గోల్‌మాల్ జరిగినట్లు పెద్ద ఎత్తున విమర్శలు వచ్చినా పట్టించుకున్న దిక్కు లేదు.

పోలింగ్‌కు ముందు రూ.20 కోట్ల రుణాలు

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల సమయంలో ఏప్రిల్, మే నెలల్లో పుంగనూరు, బైరెడ్డిపల్లె, పలమనేరు, వి.కోట, మదనపల్లె డీసీసీబీ బ్యాంకు బ్రాంచీల ద్వారా పంట రుణాల పేరిట రూ.20 కోట్లు మంజూరు చేశారు. అక్కడి రైతుల భూమిని మేనేజర్లు తనఖా పెట్టుకుని రుణాలు ఇవ్వాలి. అలా కాకుండా సిఫార్సుల మేరకు ఇష్టమొచ్చినట్లు రుణాలు మంజూరు చేసినట్లు తెలుస్తోంది. ఈ రుణాలన్నీ వైసీపీ శ్రేణులకే చేరినట్లు ఆరోపణలున్నాయి. ఇలా ఏయే బ్రాంచీల్లో ఎంత మేరకు పంట రుణాలను ఇచ్చారో బ్రాంచీల వారీగా లెక్కలు చూసి.. విచారిస్తే నిజాలు బయటపడతాయి. ఈ దిశగా ప్రస్తుత ప్రభుత్వం చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

జిల్లాకు రెండు కేంద్రీయ విద్యాలయాలు

- చిత్తూరులో కావాలని ఇప్పటికే ప్రతిపాదన
- వచ్చేవారం కేంద్ర బృందం పర్యటన
- మరొకటి కుప్పంలో ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం

చిత్తూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): బటన్లు నొక్కడమే అభివృద్ధిగా భావించిన వైసీపీ ప్రభుత్వానికి.. ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి మధ్య పాలనలో తేడా స్పష్టంగా కనిపిస్తోంది. గత ప్రభుత్వంలో జిల్లాకు కేంద్రీయ విద్యాలయం మంజూరైనా.. ఏర్పాటుకు చిత్తశుద్ధి చూపలేదు. ఇప్పటి ప్రభుత్వం రెండు కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటు దిశగా అడుగులేస్తోంది. వైసీపీ ప్రభుత్వంలో జిల్లాల విభజన జరిగినప్పుడే జిల్లా కేంద్రమైన చిత్తూరుకు కేంద్రీయ విద్యాలయ మంజూరైంది. చిత్తూరుతో పాటు అన్నమయ్య జిల్లాకూ మంజూరయ్యాయి. అక్కడ మరుసటి సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభమయ్యాయి. చిత్తూరులో మాత్రం సరైన భూమిని చూపించడంలో అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం, శ్రద్ధ లోపించింది. దీంతో విద్యాలయ ప్రారంభానికి నోచుకోలేదు. జిల్లా విభజన తర్వాత చిత్తూరులో చెప్పుకోదగ్గ స్థాయిలో ఒక్క విద్యా సంస్థ కూడా లేకుండా పోయింది. కేంద్రీయ విద్యాలయమైనా వచ్చిందనుకుంటే అప్పటి పాలకుల నిర్లక్ష్యంతో అదీ నెరవేరలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగా.. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ కేంద్రీయ విద్యాలయ సత్వంగ్ కమిషనర్‌కు లేఖ రాశారు. స్థలాన్ని పరిశీలించి వెంటనే ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని అందులో పేర్కొన్నారు. చిత్తూరులోని మంగసముద్రం ప్రాంతంలో.. సర్వే నెంబరు 167లో 8.08 ఎకరాల్ని కేంద్రీయ విద్యాలయ కోసం కేటాయించారు. వచ్చే వారం కేంద్రీయ విద్యాలయ సత్వంగ్ బృందం స్థల పరిశీలనకు రానుంది. ఇక, సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పంలోనూ మరో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. గురువారం అధికారులు స్థలాన్ని పరిశీలించారు. కుప్పానికి ఆరు కిలోమీటర్ల దూరంలోని కృష్ణదాస్‌పల్లెలో 10 ఎకరాల్ని కేటాయించినట్లు తెలుస్తోంది.


కేంద్రీయ విద్యాలయం, ఎయిర్‌స్ట్రిప్ స్థలాల పరిశీలన

కుప్పం/రామకుప్పం, జూలై 11: కుప్పం డివిజన్‌లో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం నిర్ణయించినట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ చెప్పారు. దీనికోసం కుప్పం మండలంలోని కృష్ణదాసనపల్లె వద్ద గురువారం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌తో కలిసి ఆయన స్థలాన్ని పరిశీలించారు. విద్యార్థులకు పూర్తి భద్రత కలిగిన ప్రాంతంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకోసం అనువైన స్థల పరిశీలన జరుపుతున్నామని కలెక్టరు చెప్పారు. అనంతరం శాంతిపురం, రామకుప్పం మండలాల మధ్య అమ్మవారిపేట, కిలాకిపోడు గ్రామాల సమీపంలో కార్గో ఎయిర్ పోర్టు నిర్మాణంకోసం గతంలో సేకరించిన స్థలాన్ని పరిశీలించారు. ఆ భూముల సరిహద్దులు, రైతులకు చెల్లించిన నష్టపరిహారం తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే ఎయిర్ పోర్టు ఏర్పాటుకు అడుగులు పడతాయని హామీ ఇచ్చారు. ఒకసారి కార్గో ఎయిర్ పోర్టు వస్తే, తమ ఉద్యాన పంటలను ఇతర ప్రాంతాల్లోని విపణికి ఎగుమతి చేసి అత్యధిక లాభాలు పొందే అవకాశం కుప్పం రైతులకు కలుగుతుందని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో ఆర్డీవో జి.శ్రీనివాసులు, తహశీల్దారు హరికుమార్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, టీడీపీ నాయకులు పీఎస్.మునిరత్నం, డాక్టర్ సురేశ్, రామకుప్పం మండల నాయకులు మునస్వామి, ఆనంద రెడ్డి, నరసింహులు, రామ్మూర్తి, పత్ర నారాయణాచారి తదితరులు పాల్గొన్నారు.



కేడీ పల్లె వద్ద కేంద్రీయ విద్యాలయం స్థల పరిశీలనలో కలెక్టర్, ఎమ్మెల్సీ తదితరులు

ఇసుక కావాలంటే ఇలా...



చిత్తూరు (సెంట్రల్), జూలై 11: జిల్లాలో ఇసుక అవసరమైన వారు ఆన్‌లైన్ ద్వారా తమ వివరాలు నమోదు చేసుకోవాలని మైన్స్ డీడీ ప్రసాద్ తెలిపారు. కేవలం రవాణా, లోడింగ్ చార్జీలు చెల్లించి ఇసుక పొందవచ్చన్నారు. జిల్లాలోని దిగువమాసనపల్లి, పాలూరు, బైరెడ్డిపల్లి స్టాక్ పాయింట్లలో ప్రస్తుతం 1.80 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక లభ్యతలో ఉందన్నారు. కేవలం ట్రాక్టర్ల ద్వారానే ఇసుక సరఫరాకు అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. ఎలాంటి టిప్పర్ల ద్వారా ఇసుకను తరలించే వీలు లేదన్నారు. అవసరమైతే జిల్లా కలెక్టర్ ఆదేశాలు, అనుమతులతో కేవలం 10 టన్నుల టిప్పర్‌కు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. అది కూడా జిల్లా దాటి వెళ్లడానికి వీల్లేదని స్పష్టం చేశారు.

సుధీర్ నర్సింగ్ హోమ్ ఎదుట టీడీపీ కార్యకర్తల నిరసన

- రాళ్లదాడిలో పగిలిన అద్దాలు

కుప్పం, జూలై 11: కుప్పం మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ సుధీర్ నర్సింగ్ హోమ్ ఎదుట టీడీపీ కార్యకర్తలు గురువారం నిరసన తెలిపారు. ఆయన టీడీపీలో చేరేందుకు వీల్లేదంటూ నినాదాలు చేశారు. వాళ్లల్లో కొందరు ఆవేశంతో రాళ్లు విసరడంతో నర్సింగ్ హోమ్ అద్దాలు పగిలాయి. మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ సుధీర్, 9 మంది కౌన్సిలర్లతో కలిసి టీడీపీలో చేరనున్నారంటూ 'టీడీపీలోకి కుప్పం మున్సిపల్ ఛైర్మన్?' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం కుప్పం నియోజకవర్గంలో గురువారం కలకలం సృష్టించింది. ఆ తర్వాత పలు సామాజిక మాధ్యమాలూ ఈ వార్తను విస్తృతంగా ప్రచారం చేశాయి. ఈ క్రమంలో టీడీపీలోని కొందరు కార్యకర్తలు నర్సింగ్ హోమ్ వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. వైసీపీలో ఉండి టీడీపీ కార్యకర్తలపై దాడులు చేయించి, అక్రమ కేసులు పెట్టించిన ఛైర్మన్.. టీడీపీలో చేరడానికి అంగీకరించబోమని ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. నర్సింగ్ హోమ్‌పై రాళ్లు విసరడంతో అద్దాలు పగిలాయి. ఇంతలో పోలీసులు అక్కడకు చేరుకుని వీరిని చెదరగొట్టారు.



పగిలిన నర్సింగ్ హోమ్ అద్దాలు

అమరావతిలోనే మున్సిపల్ ఛైర్మన్

ఇక, టీడీపీలో చేరేందుకని సహచర 9 మంది కౌన్సిలర్లతో వెళ్లిన మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ సుధీర్ గురువారం కూడా అమరావతిలోనే ఉండిపోయారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. మంగళగిరిలో మొదట టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్‌ను కలవడానికి వీరు ప్రయత్నించారు. ఆయన అపాయింట్‌మెంట్ దొరకడం ఆలస్యమయ్యేలా ఉండడంతో అక్కడే ఉండిపోయారు. అన్నమయ్య జిల్లాకు చెందిన మంత్రి ద్వారా వీరు అమరావతి దాకా వెళ్లగలిగారు. అదే సమయంలో కుప్పంలో గురువారం కొందరు టీడీపీ కార్యకర్తల నిరసన నేపథ్యంలో వీరి చేరిక మరికొంత ఆలస్యమయ్యేలా కనిపిస్తోంది. రెండుమూడు రోజులైనా సరే, అమరావతిలోనే ఉండి, టీడీపీలో చేరికకు లోకేశ్ లేదా చంద్రబాబునుంచి ఆమోదం పొందాకే సుధీర్ వెనుదిరిగే అవకాశం ఉంది. ఈ పరిణామాలపై ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ సహా టీడీపీ నాయకులెవరూ వ్యాఖ్యానించడంలేదు. ఈయన చేరిక కొందరు టీడీపీ నాయకులకు ఇష్టంలేదని తెలుస్తోంది. ఎవరికి ఎంత వ్యతిరేకత ఉన్నాసరే, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పరోక్ష సహకారంతో వీరు టీడీపీలో చేరడం ఖాయంగా కనిపిస్తోంది.

దైవ దర్శనానికి వచ్చాం: టీడీపీలో చేరికపై మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ సుధీర్‌ను 'ఆంధ్రజ్యోతి' ఫోన్ ద్వారా వివరణ కోరగా తాము విజయవాడ వచ్చిన మాట నిజమేనని అంగీకరించారు. ఇది రాజకీయ ట్రిప్ కాదని, దైవ దర్శనానికి మాత్రమే వచ్చామని చెప్పారు. తిరిగి వచ్చాక మిగిలిన విషయాలు మాట్లాడతానని వివరించారు.

'ఆట'విడుపు!



బ్యాట్ ఝుళిపిస్తున్న కలెక్టర్ - బంతిని టార్గెట్ చేసిన ఎమ్మెల్సీ

కుప్పం, జూలై 11: ఒకరు జిల్లా పరిపాలనా వ్యవహారాల్లో తలమునకలైన అధికారి. మరొకరు ఇటు పరిపాలన, అటు రాజకీయ కార్యకలాపాల్లో నిమగ్నమైన ప్రజాప్రతినిధి. వారిద్దరికీ కాస్త ఆటవిడుపు లభించింది. అవకాశం వెదక్కుంటూ రావడం కాదు.. వాళ్లే దాని దగ్గరికి వెళ్లిపోయారు. క్రికెట్ ఆడుతున్న యువతరాన్ని చూసి తమ హోదాలను మరచిపోయి సరదాగా బ్యాట్ ఝుళిపించారు. వారే కలెక్టరు సుమిత్‌కుమార్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్. గురువారం కుప్పం మండలం కృష్ణదాసనపల్లె వద్ద కేంద్రీయ విద్యాలయంకోసం స్థల పరిశీలన జరిపి వస్తున్నప్పుడు జరుగు గ్రామ సమీపంలోని మైదానంలో కొందరు యువకులు క్రికెట్ ఆడుతూ కనిపించారు. వారిని చూసి వీరూ టీనేజీ యువకులైపోయారు. తమ వాహనాలు దిగి ఒకరితర్వాత ఒకరుగా క్రికెట్ బ్యాట్‌లు పట్టుకుని బంతిని బౌండరీకి పరుగులు తీయించారు. యువత క్రీడల్లో రాణించడానికి అనువైన వాతావరణాన్ని ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. దీనికోసం కుప్పంలోని ఎన్టీఆర్ స్టేడియాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. పంచాయతీ కేంద్రాల్లోనూ క్రీడా మైదానాల అభివృద్ధిపై దృష్టి సారిస్తామని హామీ ఇచ్చారు.

మరింత తక్కువ ధరకు నిత్యావసరాలు



రైతు బజార్లో బియ్యం కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఎస్వో శంకరన్

చిత్తూరు (సెంట్రల్), జూలై 11: రైతు బజార్లో మరింత తక్కువ ధరకు నిత్యావసర సరుకులు విక్రయించనున్నట్లు జిల్లా పౌర సరఫరాల అధికారి (డీఎస్వో) శంకరన్ తెలిపారు. గురువారం రైతు బజార్లో మార్కెటింగ్ ఏడీ పరమేశ్వర్‌తో కలిసి బియ్యం కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కిలో కందిపప్పు బహిరంగ మార్కెట్‌లో రూ.190 నుంచి రూ.200, బియ్యం రూ.52 నుంచి రూ.58 వరకు పలుకుతున్నాయని తెలిపారు. రైతు బజారుతో పాటు జిల్లాలోని పలు ప్రొవిజన్స్ స్టోర్స్‌లో కిలో కందిపప్పు రూ.160, బియ్యం రూ.49లకు అందుబాటులో తెచ్చామన్నారు. చిత్తూరు రైతు బజార్లో (బియ్యం, కందిపప్పు), వినాయక స్టోర్స్‌లో (కందిపప్పు), కృష్ణమూర్తి అండ్ సన్స్‌లో (బియ్యం), హైరోడ్డులోని గుప్తాలో (బియ్యం), బజారు వీధిలోని శ్రీబాలాజీ ట్రేడర్స్‌లో (బియ్యం), పుంగనూరు ప్రభు ఇండస్ట్రీస్, ట్రేడర్స్‌లో (కందిపప్పు), కల్లూరు ఎఫ్ఎంఎస్ ట్రేడర్స్‌లో (కందిపప్పు) అందుబాటులోకి తెచ్చామన్నారు.

పొలాలకు దారి మూసేస్తారా?

● ఆరడిగుంట వద్ద రైతుల నిరసన



పొలాల వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

పుంగనూరు, జూలై11: వందేళ్లుగా వ్యవసాయ పొలాలకు ఉన్న దారిని శ్రీకాళహస్తి పైపుల ఫ్యాక్టరీ యాజమాన్యం మూసివేసి ఇబ్బందులు పెట్టడం దారుణమని బాధిత రైతులు నిరసన వ్యక్తం చేశారు. గురువారం పుంగనూరు మండలం ఆరడిగుంట వద్ద పరిశ్రమలకు గత ప్రభుత్వం కేటాయించిన భూముల్లో దారిలేకుండా ట్రెంచ్ తీసిన ప్రాంతంలో వీరు ఆందోళనకు దిగారు. గత ప్రభుత్వంలో భూములు పరిశ్రమకు ఇచ్చారని, ఆ సమయంలో పొలాలకు వెళ్లేందుకు రైతులకు దారి ఇస్తామని చెప్పి ప్రస్తుతం మాటతప్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పొలాల్లో పండించిన పంటలను పట్టణానికి తరలించాలంటే ఇబ్బందిగా ఉందన్నారు. ఈ విషయాన్ని ఈనెల నాలుగోతేది తహసీల్దార్ శివయ్యకు టీడీపీ నేతల ద్వారా ఫిర్యాదులుచేయగా అధికారులు పరిశీలించి ఫ్యాక్టరీయజమాన్యంతో మాట్లాడి రైతులకు దారి ఇవ్వాలని ఆదేశించినట్లు తెలిపారు. ఫ్యాక్టరీ యాజమాన్యం దారి ఇవ్వకుండా ఇబ్బందులు గురిచేయడం సరికాదన్నారు. తమపై కక్షసాధింపు చర్యలకు పాల్పడితే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని, వెంటనే దారి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని యాజమాన్యం దృష్టికి తీసుకెళతామని సెక్యూరిటీ సిబ్బంది రైతులతో చెప్పారు.

ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోండి

చిత్తూరు రూరల్, జూలై 11: అగ్నివీర్ పథకంలో భాగంగా ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి పద్మజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్‌లో ఫిజిక్స్, మ్యాథ్స్‌లో 50 శాతం మార్కులు లేదా మూడు సంవత్సరాల ఇంజనీరింగ్ డిప్లమా విద్యార్హత ఉండాలని పేర్కొన్నారు. అర్హులైన వారు ఈనెల 28వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. https;//agnipath-vayyu.cdac.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

కుప్పంలో అదనపు మండలాల ఏర్పాటుకు కమిటీ నియామకం

కుప్పం, జూలై 11: కుప్పం రెవెన్యూ డివిజన్‌లో అదనంగా రెండు మండలాల ఏర్పాటుపై అధ్యయనం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కమిటీ వేసింది. పీఆర్ అండ్ ఆర్డీ కమిషనర్ కె.కన్నబాబు జీవో నెంబర్ 485 విడుదల చేశారు. ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్‌గా చైర్మన్‌గా ఉండే ఈ కమిటీలో సర్వే సెటిల్‌మెంట్స్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ కమిషనర్, పంచాయతీరాజ్ కమిషనర్ చిత్తూరు జిల్లా కలెక్టర్లు సభ్యులుగా ఉంటారు. శాంతిపురం మండలం నుంచి రాళ్లబూదుగూరు, కుప్పం మండలం నుంచి మల్లనూరును విడదీసి రెండు ప్రత్యేక మండలాలుగా ఏర్పాటు చేయడానికి గల సాధ్యా సాధ్యాలను ఈ కమిటీ పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తుంది.

రోడ్డు ప్రమాదంలో సర్పంచి దుర్మరణం



తులసిప్రసాద్‌రెడ్డి (ఫైల్ ఫొటో)

ఐరాల, జూలై 11: ఐరాల మండలం ఎర్రేపల్లె సర్పంచ్ తులసిప్రసాద్‌రెడ్డి(48) బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. కాణిపాకం ఎస్ఐ రామ్మోహన్ తెలిపిన ప్రకారం.. తన సొంత పని నిమిత్తం సర్పంచ్ తులసిప్రసాద్‌రెడ్డి చిత్తూరు వెళ్లి బుధవారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరారు. 45కొత్తపల్లె వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కనున్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. రాత్రి 11 గంటలు అవుతున్నా తులసి ప్రసాద్‌రెడ్డి ఇంటికి రాకపోవడం.. సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ అయి ఉండటంతో అతడ బంధువులు వెతుకుతూ వచ్చారు. రోడ్డుపై పడి ఉన్న అతడ్ని చూసి హుటాహుటినా చీలాపల్లె సీఎంసీకి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. మృతదేహానికి గురువారం చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం చేసి కుటుంబీకులకు అప్పగించారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

4 నుంచి 11వ తేదీవరకు తిరుమల ఎక్స్‌ప్రెస్ రద్దు

తిరుపతి(సెంట్రల్), జూలై 11: కడప-తిరుపతి-విశాఖపట్టణం మధ్య నడుస్తున్న తిరుమల ఎక్స్‌ప్రెస్ (17487-17488)ను ఆగస్టు నాలుగు నుంచి 11వ తేదీవరకు రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. విజయవాడ-విశాఖపట్టణం మధ్య ఆటోమేటిక్ సిగ్నల్ పనులు జరుగుతున్న కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గుర్తించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

వైసీపీ ఆక్రమణల నుంచి ఆలయ భూమికి విముక్తి

ఆలయ స్థలంగా అధికారుల గుర్తింపు ● శుభ్రం చేయించిన వీరశైవలింగాయత్‌లు



పుంగనూరు భోగనంజుండేశ్వరస్వామి ఆలయం



ఆలయ స్థలాన్ని శుభ్రం చేస్తున్న ఎక్స్‌కవేటరు

పుంగనూరు, జూలై 11: పుంగనూరు భోగనంజుండేశ్వరస్వామి ఆలయ భూమికి వైసీపీ నేతల ఆక్రమణల నుంచి గురువారం విముక్తి లభించింది. పట్టణ నడిబొడ్డున.. ఆలయం పక్కనే ఉన్న ఈ అత్యంత విలువైన స్థలంపై వైసీపీ కన్నుపడింది. మేలుపట్ల రెవెన్యూ గ్రామంలోని సర్వేనెంబరు 115-13లో 22సెంట్లు స్థలం దేవుడికి చెందిన ఆలయ భూమిగా గుర్తించి అమ్మడం, కొనడం చెల్లదని ఖాతానెంబరు 600009లో ప్రభుత్వ రికార్డుల్లో పొందుపరిచి 22ఏ నిషేధిత జాబితాలో నమోదైంది. ఆలయాన్ని 1999లో దేవదాయ శాఖ స్వాధీనం చేసుకోగా, ఆలయం తమదేనని 2000 సంవత్సరంలో మదనపల్లె ఏడీజే కోర్టులో కేసు దాఖలు చేయగా 2005లో కోర్టు ఫౌండర్ ట్రస్టీగా నాగరాజస్వామి కుటుంబీకులనే ప్రకటించింది. తర్వాత మళ్లీ ఎండోమెంట్ అధికారులు ఆలయం దేవదాయశాఖదేనని కోర్టులో కేసు వేయగా గత ఏడాది జూలైలో.. ఆ దేవాలయం దేవదాయశాఖకు చెందినదేనని తీర్పు రావడంతో అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఒక హోటల్, ఇళ్లు ఉన్న స్థలాన్ని కొంతకాలం క్రితం ఖాళీచేయించి ఇటీవల ఆలయం పక్కనే ఉన్న విలువైన స్థలం ఆలయానికి సంబంధించినది కాదని ప్రైవేటు భూమి అంటూ యథేచ్ఛగా ఎక్సకవేటర్‌తో శుభ్రం చేసి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ఏర్పాట్లు చేశారు. వైసీపీ ముఖ్యనేతల జోక్యంతో ఆలయ భూమి 115/3లోని 22 సెంట్లు భూమిని సర్వేనెంబరు 115/2గా ముస్లిం వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేయించి స్థలాన్ని అప్పగించారు. దీనికి సంబంధించి అభ్యంతరాలున్నా మున్సిపల్ అధికారులు ప్లాన్ అప్రూవల్ చేశారు. ఈ ఆక్రమణలపై గతేడాది ఏప్రిల్ 8వ తేది 'భోగనంజుండేశ్వరుడి భూమికే ఎసరు, కబ్జాకోరల్లో రూ.కోట్ల విలువైన స్థలం' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. అప్పుడు వైసీపీ ప్రభుత్వం ఉండటం వల్ల ఆ పార్టీ నాయకుల ఆదేశాలతో మున్సిపల్, రెవెన్యూ అధికారులు తూతూ మంత్రంగా సర్వే చేశారు. విషయాన్ని తేల్చకుండా కాలయాపన చేశారు. గతంలోనే వీరశైవలింగాయత్ కులస్తులు, మరికొందరు భక్తులు, ఆలయ అధికారులు ఈ భూమిని ఆక్రమణల నుంచి కాపాడాలని అభ్యర్థించినా ఏమీ చేయలేక పోయారు. కాగా, సర్వే చేసి ఆలయ భూమికి హద్దులు చూపాలని గ్రూప్‌టెంపుల్స్ ఈవో కమలాకర్ తహసీల్దారును కోరారు. దీనిపై సర్వేయర్ కిరణ్మయి సర్వే చేసి ఎస్ఎల్ఆర్, ఇతర రికార్డుల ప్రకారం ఆలయ భూమిగా గుర్తించారు. ఈవో కమలాకర్ 115/3 సర్వేనెంబరు 22సెంట్లు స్థలం ఆలయానిదని, ఈస్థలంపై మున్సిపల్ అధికారులు మంజూరు చేసిన ప్లాన్ అప్రూవల్ రద్దు చేయాలని లేఖపంపారు. స్థానిక వీరశైవలింగాయత్ కులస్తులు ఆక్రమణ స్థలాన్ని ఎక్సకవేటర్‌తో శుభ్రం చేయించి మట్టి నింపుతున్నారు. కానీ ఆలయ ఈవో కమలాకర్ ఆలయం వద్ద లేకుండా, ఫోన్‌కు అందుబాటులో లేరు. ఎట్టకేలకే వైసీపీ చెర నుంచి దేవుడి భూమి ఆలయానికి చెందినదిగా తేలడంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రిజిస్ట్రేషన్లకు బ్రేక్

జిల్లావ్యాప్తంగా పనిచేయని సర్వర్లు
ఈసీఈలకు తప్పని తిప్పలు



రిజిస్ట్రేషన్ కోసం వేచివున్న ప్రజలు

చిత్తూరు కలెక్టరేట్, జూలై 11: జిల్లావ్యాప్తంగా గురువారం రిజిస్ట్రేషన్లకు బ్రేక్ పడింది. సర్వర్ పనిచేయకపోవడంతో సుదూర ప్రాంతాల నుంచి రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వచ్చిన పలువురు సాయంత్రం వరకు పడిగాపులు కాచి, వెనుదిరగాల్సి వచ్చింది. జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ ఇదే పరిస్థితి కొనసాగింది. ఫలితంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒక్క రిజిస్ట్రేషన్ కూడా జరగలేదు. ఈసీ రాలేదు. విజయవాడలోని ప్రధాన కార్యాలయంలో సాంకేతిక కారణాలతో సమస్య ఏర్పడిందని అధికారులు ప్రకటించారు. గత ప్రభుత్వం దస్తావేజుల రిజిస్ట్రేషన్‌కు కార్డ్ ప్రైమ్ 2.0 సాఫ్ట్‌వేర్‌ను తీసుకొచ్చింది. దీంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియలో సమస్యలు ప్రారంభమయ్యాయి. ఈసీల జారీకి కూడా ఇదే సాఫ్ట్‌వేర్‌ను కొనసాగించడంతో సమస్య మరీ తీవ్రమైంది. గతంలో ఉన్న 1.0 ఫార్మెట్‌లో డాక్యుమెంట్ నెంబరు నమోదు చేయగానే ఈసీలు వచ్చేవి. 2.0 సాఫ్ట్‌వేర్‌కు మారిన తర్వాత ఈసీ పొందడం కష్టతరమైంది. సార్వత్రిక ఎన్నికల అనంతరం జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకుంది. భూములు, స్థలాలు, ఇళ్ల రిజిస్ట్రేషన్లు పెరుగుతున్నాయి. అయితే కార్యాలయాల్లో సక్రమంగా రిజిస్ట్రేషన్లు జరక్కపోవడంతో జిల్లాలోని స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయానికి రూ.కోట్లలో గండి పడుతోంది.

సమస్యను పరిష్కరిస్తున్నాం..

సర్వర్ సమస్యను ఉన్నతాధికారులకు తెలియజేశాం. సాంకేతిక కారణాలతోనే జిల్లా అంతటా ఒక్క రిజిస్ట్రేషన్ కూడా జరక్కపోవడం నిజమే. శుక్రవారం నుంచి సర్వర్ పనిచేస్తుంది.

- శ్రీనివాసరావు, జిల్లా రిజిస్ట్రార్, చిత్తూరు

నగరిలో అత్యధిక వర్షం

చిత్తూరు కలెక్టరేట్, జూలై 11: జిల్లావ్యాప్తంగా గడచిన 24 గంటల్లో 21 మండలాల్లో తేలికపాటి నుంచి అధిక వర్షపాతం నమోదైంది. అత్యధికంగా నగరిలో 62.8మి.మీ, అత్యల్పంగా బైరెడ్డిపల్లిలో 0.8 వర్షం కురిసింది. శ్రీరంగరాజపురం 60.2, విజయపురం 42.6, కార్వేటినగరం 40.8, యాదమరి 38.4, పాలసముద్రం 33.2, గుడిపాల 26.4, నింద్ర 23.4, గంగాధరనెల్లూరు 14.0, పెనుమూరు 10.0, వెదురుకుప్పం 9.4, పూతలపట్టు 9.0, చిత్తూరు అర్బన్ 9.0, బంగారుపాళ్యం 4.8, చిత్తూరు రూరల్ 3.4, ఐరాల 3.2, శాంతిపురం 2.8, గంగవరం 2.6, తవణంపల్లె 2.2, పెద్దపంజాణి 1.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

కుక్కల దాడిలో జింక మృతి



జింక కళేబరం

గుడిపాల, జూలై 11: మండలంలోని పాపసముద్రం పంచాయతీ అడవిచేను గ్రామంలో గురువారం సాయంత్రం కుక్కల దాడిలో ఓ జింక మృతిచెందింది. గ్రామస్తులు గమనించి, అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీ అధికారులు రాకపోగా కళేబరాన్ని ఉదయం తీసుకెళతామని, గ్రామంలోనే భద్రంగా ఉంచాలని ఫోన్ ద్వారా చెప్పడం గ్రామస్తులను విస్మయానికి గురిచేసింది.

ట్రిపుల్ ఐటీకి 135 విద్యార్థుల ఎంపిక

చిత్తూరు (సెంట్రల్), జూలై 11: రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీకి (ఆర్జేయూకేటీ) గురువారం విడుదల చేసిన ప్రవేశ పరీక్షల్లో జిల్లాలోని 135 మంది విద్యార్థులు ఎంపికయారు. ఈ ఏడాది టెన్త్ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు ఆర్జేయూకేటీకి దరఖాస్తు చేసుకున్నారు. వీరి అర్హతల ఆధారంగా ఫలితాలు విడుదల చేశారు. ఎంపికైన 135 మంది విద్యార్థుల్లో నూజివీడు క్యాంపస్‌కు ఆరుగురు, ఆర్కే వ్యాలీకి 103 మంది, ఒంగోలు క్యాంపస్‌కు 17 మంది, శ్రీకాకుళం క్యాంపస్‌కు తొమ్మిది మంది ఎంపికయ్యారు. ఈ నెల 22 నుంచి 27 వరకు కౌన్సెలింగ్ నిర్వహించనుండగా, ఆగస్టు మొదటి వారం నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి.

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న భీమారావు

చిత్తూరు లీగల్, జూలై 11: ద్విచక్ర వాహనాల్లో వెళ్లే ప్రతిఒక్కరూ తప్పకుండా హెల్మెట్ ధరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు కోరారు. గురువారం సాయంత్రం ఆయన జిల్లా కోర్టు ప్రాంగణంలో హెల్మెట్ ధారణ గురించి పోలీసులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమన్నారు. హెల్మెట్ ధరించని వ్యక్తులు తమ కుటుంబం గురించి ఆలోచించుకోవాలన్నారు. వెనుక ఉన్న వ్యక్తులు కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఈ విషయాలను పోలీసులు గుర్తుంచుకుని, వాహనదారులకు అవగాహన కల్పించాలని అన్నారు. ఈ సమావేశంలో ట్రాఫిక్ సీఐ నిత్యబాబు, ఎంవీఐ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

స్థల కేటాయింపుపై కమిషనర్‌కు నోటీసులు

● 15 రోజుల్లోపు సంజాయిషీ ఇవ్వాలని ఆదేశం

చిత్తూరు, జూలై 11: చిత్తూరు నగరపాలక సంస్థ స్థలాన్ని లీజుకు కేటాయించడంలో నిబంధనలను అనుసరించలేదంటూ కమిషనరు జె.అరుణపై క్రమశిక్షణ చర్యలు చేపట్టడానికి ప్రభుత్వం ఆధారాలను సిద్ధం చేసింది. ఈ మేరకు గురువారం ఏపీ పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్ ఉత్తర్వులు జారీచేశారు. కొంగారెడ్డిపల్లి కూరగాయల మార్కెట్‌యార్డులో 2500 అడుగుల నగరపాలక స్థలాన్ని హిమజ గ్యాస్ ఏజెన్సీ యజమాని కిషోర్‌కుమార్ రెడ్డికి నిబంధనలకు విరుద్ధంగా లీజుకు కేటాయించారు. ఈ ప్రక్రియకు సంబంధించి బహిరంగ వేలం నిర్వహించకుండా బాక్స్ టెండర్ ద్వారా కట్టబెట్టడం, ఈ సమాచారాన్ని ప్రభుత్వానికి సక్రమంగా అందించకపోవడం తదితర కారణాలతో ఆమెపై అభియోగం నమోదైనట్లు ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. ఆరు రకాల అంశాలకు సంబంధించి విచారణకు ఏర్పాట్లు చేసుకున్నామని, నోటీసు అందుకున్న 15రోజుల్లోపు రాతపూర్వకంగా సంజాయిషీ ఇవ్వాలని, లేని పక్షంలో క్రమశిక్షణా చర్యలు తప్పవని పేర్కొన్నారు.

రంగునీళ్ల సమస్య పరిష్కారానికి కృషి

నగరి టీడీపీ నేతల ఆత్మీయ సమావేశంలో ఎంపీ దగ్గుమళ్ల ● ఇక కమీషన్ల వ్యవహారం ఉండదన్న ఎమ్మెల్యే భాను



టీడీపీ నాయకుల ఆత్మీయ సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీ ప్రసాదరావు

నగరి జూలై 11: నగరి నియోజకవర్గంలో టెక్స్‌టైల్స్‌పార్కు ఏర్పాటు, రంగునీళ్ల సమస్యపై జిల్లా అధికారులతో ప్రణాళికలను సిద్ధం చేసి కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తామని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు తెలిపారు. నగరిలో గురువారం జరిగిన టీడీపీ ఆత్మీయ సమావేశంలో ఆయన ప్రసంగించారు. అసంపూర్తిగా ఉన్న టిడ్కో గృహాలకు అవసరమైన నిధులను మంజూరు చేయించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మీ ప్రాంతాలలో ఏ పని ముఖ్యమో గుర్తించి అంచనాలను వేయించి ఎమ్మెల్యే ద్వారా తన దృష్టికి తీసుకొస్తే మంజూరుచేయించేలా చర్యలు తీసుకుంటానన్నారు.శ్మశానాలకు సౌకర్యాలు లేక ఇబ్బంది పడటం, డ్రైనేజీ, తాగునీటి సమస్య తదితరాలను గుర్తిస్తే ఎంపీ లాడ్స్ ద్వారా పనులు చేయిద్దామన్నారు. గత ఐదేళ్లలో ఎంపీ లాడ్స్ ఎక్కడ ఖర్చుపెట్టారో తెలియడం లేదన్నారు. పరిశ్రమల స్థాపనకు ఎవరైనా ముందుకొస్తే సహకరిస్తామన్నారు. ఎన్నికల ముందు ఏమి చెప్పానో అదే మాటకు కట్టుబడి కష్టించి పని చేసిన ప్రతి కార్యకర్త, నాయకుడిని ఆదుకుంటామని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చెప్పారు. ఏ చిన్న సమస్యనైనా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కమీషన్ల వ్యవహారం ఉండదని, ఏపని కావాలన్నా ఎవరికీ రూపాయి కూడా ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు.మండలాల పార్టీ అధ్యక్షులు రమేష్ బాబు, రమేష్‌రాజు, వెంకటేశ్వరచౌదరి, రవికుమార్, పార్లమెంటరీ అధికారప్రతినిధి చిన బాబు, నాయకులు గంజి మాధవయ్య, సురేష్ నాయుడు, రాష్ట్ర టీఎన్‌టీయూసీ కార్యదర్శి బాలాజి, జిల్లా అధికారప్రతినిధి జ్యోతినాయుడు, తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి మీరా, రాష్ట్ర ఎస్సీసెల్ అధికారప్రతినిధి దశరదవాసు, నేతలు అల్లిముత్తు, ఉమాపతి రాజు, ధనంజయరాజు, కృష్ణారెడ్డి, లక్ష్మీప్రసన్న, హేమావతి తదితరులు పాల్గొన్నారు.

పలమనేరులో అక్రమ మద్యం ధ్వంసం



పలమనేరు, జూలై 11: వివిధ కేసుల్లో పట్టుబడిన రూ. 19 లక్షల విలువ చేసే మద్యాన్ని గురువారం పలమనేరులో అధికారులు ధ్వంసం చేశారు. పలమనేరు అర్బన్ పోలీసు స్టేషన్ పరిధిలో 82 కేసులకు సంబంధించి రూ. 17.98 లక్షల విలువచేసే 2569.69 లీటర్లు, బైరెడ్డిపల్లె పరిధిలో 56కేసులకు సంబంధించి రూ.8 లక్షల విలువైన 1,142.29 లీటర్లు, పలమనేరు ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో 66 కేసులకు సంబంధించి రూ.1.33 లక్షలు విలువ చేసే 190 లీటర్ల మద్యాన్ని ధ్వంసం చేశారు. ఎస్ఈబీ ఎన్‌ఫోర్సుమెంట్ సూపరింటెండెంట్ వి.శ్రీధర్‌రావు, అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఎం.రవి, పలమనేరు అర్బన్ సీఐ చంద్రశేఖర్, ఎస్.ఐ బి.కృష్ణయ్య బైరెడ్డిపల్లి ఎస్ఐ, పలమనేరు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

తిరుపతిలో డిప్యూటీ చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం

తిరుపతి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): డైరెక్టరేట్ ఆఫ్ ఎలక్ట్రికల్ సేఫ్టీ అండ్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ పరిధిలో తిరుపతి కేంద్రంగా డిప్యూటీ చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం ఏర్పాటు కానుంది. ఇక్కడ ఈ కార్యాలయం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. తిరుపతి కార్యాలయం పరిధిలోకి తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, నెల్లూరు జిల్లాలు రానున్నాయి. అలాగే దీని పరిధిలో కడప, నెల్లూరు, తిరుపతి సబ్ డివిజన్లు వుంటాయి. ఇప్పటికే సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ కేంద్రంగా విద్యుత్ శాఖకు సంబంధించి తిరుపతి కీలక కేంద్రంగా కొనసాగుతున్న సంగతి తెలిసిందే. తాజాగా నేరుగా ప్రభుత్వ నియంత్రణలో పనిచేసే ఎలక్ట్రికల్ సేఫ్టీ విభాగానికి సంబంధించి కూడా తిరుపతి ముఖ్య పాలనా కేంద్రంగా మారనుంది. తిరుపతిలో కార్యాలయం ఏర్పాటుకు అనుమతినిస్తూ, అలాగే డిప్యూటీ చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ పోస్టు మంజూరు చేస్తూ ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

కారు ఢీకొని ముగ్గురు కూలీల దుర్మరణం



రోడ్డుపై చెల్లాచెదురుగా రాజాసింగ్,బపున్‌సింగ్, సుఖ్‌దేవ్‌సింగ్ మృతదేహాలు

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 11: పొట్టకూటికి పొరుగు రాష్ట్రం నుంచి వచ్చిన ముగ్గురు యువకులు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. పోలీసుల కథనం మేరకు ..ఒడిశాకు చెందిన బపున్‌సింగ్ (21) రాజాసింగ్(22) సుఖ్‌దేవ్‌సింగ్(22) బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని ఆలత్తూరు శ్రీనిధి రాజా పరిశ్రమలో రెండేళ్లుగా కూలీలుగా పనిచేస్తున్నారు. కంపెనీ సమీపంలోనే కలసి ఉంటున్నారు. గురువారం వంట సరుకులు కొనుగోలు చేయడానికి కంపెనీ మేనేజర్ ద్విచక్ర వాహనంపై శ్రీకాళహస్తికి వెళ్లి తిరిగి వస్తుండగా బుచ్చినాయుడుకండ్రిగ నుంచి అతి వేగంగా వస్తున్న కారు ఢీకొంది. దీంతో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడి అక్కడిక్కడే మృతి చెందారు. పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా అస్పత్రికి తరలించారు. పరారైన కారు డ్రైవరు కోసం గాలిస్తున్నట్లు ఎస్ఐ వెంకటనరసింహ తెలిపారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

రైతులకు అండగా టీడీపీ కూటమి ప్రభుత్వం


మొక్కజొన్న విత్తనాలు పంపిణీ చేస్తున్న మునస్వామి

రామకుప్పం, జూలై 11: టీడీపీ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో రైతులకు ఎల్లవేళలా అండగా నిలుస్తుందని టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి తెలిపారు. గురువారం ఆయన రామకుప్పం మండలం ఆనిగానూరు గ్రామంలో పశుసంవర్ధకశాఖ ఏడీ సతీష్‌బాబుతో కలిసి రైతులకు మొక్కజొన్న విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదిలోగా కుప్పం నియోజకవర్గానికి పూర్తి స్థాయిలో హంద్రీ-నీవా జలాలను తీసుకువస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచు రామ్మూర్తి, పార్టీ పంచాయతీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు మహేంద్రనాయుడు, మణేష్, శంకర్‌చలం, సుభాష్, బీరప్ప, గోపీ, పశుసంవర్ధకశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడి మృతి


సుబ్రహ్మణ్యం (ఫైల్‌ఫొటో)

రామకుప్పం, జూలై 11: రామకుప్పం మండలం కెంచనబల్లకు చెందిన టీడీపీ సీనియర్ నాయకులు, పార్టీ పంచాయతీ మాజీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం అనారోగ్యంతో మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గురువారం తన స్వగృహంలో మృతి చెందారు. ఆయన మృతి పట్ల టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహకకార్యదర్శి పత్ర నారాయణాచారి, మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు సంతాపం తెలియ జేశారు.

రైతు జయచంద్ర మృతికి నివాళి

బైరెడ్డిపల్లె, జూలై 11 : ప్రమాదవశాత్తు ఎద్దు పొడిచి మృతిచెందిన బైరెడ్డిపల్లెకు చెందిన రైతు జయచంద్రకు టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, తెలుగు యువత అధ్యక్షుడు భువనచంద్రగౌడ్ సంతాపం తెలిపారు. గురువారం జయచంద్ర మృతదేహంవద్ద నివాళులర్పించారు. ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు.

వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్ పై కుప్పంలో కేసు నమోదు

కుప్పం, జూలై 11: వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్‌పై కుప్పం అర్బన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ముఖ్యమంత్రి చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో స్థానిక టీడీపీ నేతలు ఆయనపై అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు యాదవ్‌పై 196(1), 351(2) బీఎన్ఎస్ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

ట్రిపుల్ ఐటీకి కమ్మనపల్లె గురుకుల విద్యార్థినులు

బైరెడ్డిపల్లె, జూలై 11 : ఇటీవల పదోతరగతి పరీక్షల్లో ఉత్తమఫలితాలు సాధించిన మండలంలోని కమ్మనపల్లె గురుకుల పాఠశాలకు చెందిన 12మంది విద్యార్థినులు ట్రిపుల్‌ఐటీకి ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ శోభ తెలిపారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులు జ్ఞానశ్రీ, నిఖితాంజలి నూజివీడులోని ట్రిపుల్‌ఐటీ కళాశాలకు, తన్మయి, హారిక, మేఘన, షణ్ముఖప్రియ, అమృత, శ్రావణి, నందిని ఆర్‌కేవ్యాలీలో ట్రిపుల్ ఐటీకి, తేజస్విని, శ్రావ్య, జాహ్నవి ఒంగోలులోని ట్రిపుల్‌ఐటీ కళాశాలకు ఎంపికైనట్లు వెల్లడించారు. ట్రిపుల్‌ఐటీకి ఎంపికైన విద్యార్థినులకు ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

బావిలో పడి చిన్నారికి తీవ్రగాయాలు

గుడుపల్లె, జూలై 11: బావిలో పడి చిన్నారికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. యామగానిపల్లె పంచాయతీ సరిగప్పకొటాలు గ్రామానికి చెందిన కుమార్, సుమ దంపతులు. వీరు ఊరికి కొంత దూరంలో ఉన్న పొలం వద్ద ఇల్లు కట్టుకుని అక్కడే జీవిస్తున్నారు. వీరికి అభి(5) నాని(3) కుమారులు ఉన్నారు. నాని ఇంటి దగ్గర బుధవారం మధ్యాహ్నం ఆడుకుంటూ సమీపంలోని వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. అక్కడ కాలుజారి బావిలో పడిపోయాడు. బావిలో నీరు లేకపోవడంతో తీవ్రగాయాలపాలై స్పృహ కోల్పోయాడు. ఈ క్రమంలో చిన్నారి కనిపించకపోవడంతో తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు పలుచోట్ల గాలించారు. బావిలో తీవ్రగాయాలతో ఉండడాన్ని గుర్తించారు. వెంటనే కుప్పంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

ఎద్దులచెరువు కట్టపై వ్యర్థాల తొలగింపు



పలమనేరు, జూలై11 : పలమనేరు ఎద్దుల చెరువు కట్టపై పేరుకుపోయిన వ్యర్థాలను పారిశుద్ధ్య కార్మికులు గురువారం తొలగించారు. కొన్నినెలలుగా వ్యర్థాలు దుర్గంధభరితంగా మారాయి. పాదచారులు, వాహనదారులు ముక్కులు మూసుకుని రాకపోకలు సాగించే వారు. దీనిపై స్థానికులు బుధవారం కమిషనర్ రమణారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన కార్మికులను తీసుకెళ్లి దగ్గరుండి శుభ్రం చేయించారు.

విశ్రాంత అధ్యాపకుడు భాస్కర్ మృతి



పలమనేరు, జూలై11 : పలమనేరుకు చెందిన విశ్రాంత అధ్యాపకులు ఎం.ఎస్ భాస్కర్ (67) మృతిచెందారు. పలువురు విశ్రాంత అధ్యాపకులు ఆయనకు సంతాపం తెలియ జేశారు. సంతాపం తెలియజేసిన వారిలో రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు గురురాజారావు, క్రిష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

అలరించిన దుర్యోధన వధ



కల్లూరు, జూలై 11: పులిచెర్ల మండలం మంగళంపేటలో కొనసాగిన మహాభారత యజ్ఞంలో భాగంగా గురువారం నిర్వహించిన దుర్యోధన వధ ఘట్టం అందరినీ అలరించింది. ముందుగా ద్రౌపది ధర్మరాజుల ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో దుర్యోధనుడి బొమ్మను మట్టితో తయారు చేసి ప్రత్యేక పూజలు చేశారు. దుర్యోధనుడుని భీమసేనుడు మడుగు నుంచి బయటకు రప్పించే సన్నివేశాన్ని భక్తులు ఆసక్తిగా తిలకించారు. దుర్యోధనుడు, భీమసేనుడు ఆలపించిన పద్యాలు ప్రజలను మైమరిపించాయి. భీమసేనుడు దుర్యో ధనుడిని వధించి అతడి రక్తాన్ని ద్రౌపదీదేవి కురులకు పట్టించే ఘట్టం విశేషంగా ఆకట్టుకుంది. దుర్యోధన వధకు తరలివచ్చిన జనంతో ఆ ప్రాంతం కిటకిటలాడింది.

పుంగనూరు సమస్యలు పరిష్కరించాలి

పుంగనూరు, జూలై11: పుంగనూరు నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేయాలని టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డిని బీజేపీ నేతలు కోరారు. గురువారం రొంపిచెర్లలో చల్లా బాబును ఆయన స్వగృహంలో వారు కలిసినట్లు తెలియజేశారు. ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన అవినీతి, రికార్డుల కాల్చివేత, ఇండోర్‌షెటిల్ కోర్టు స్టేడియం కూల్చివేత తదితర అంశాలపై అధికారులతో విచారించి చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు. త్వరలోనే మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పుంగనూరుకు వస్తారని చల్లా బాబు చెప్పారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మదన్‌మోహన్, రాజారెడ్డి, ప్రసాద్, నరసింహులు, పెద్దమఠం బాబు, ఆదినారాయణ, రాజాశెట్టి తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 16న పులిచెర్ల మండల మీట్

కల్లూరు, జూలై 11: పులిచెర్ల మండల పరిషత్ కార్యాలయం సమావేశం మందిరంలో ఈ నెల 16వ తేదీన ఉదయం 10:30 గంటలకు ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సురేష్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.జడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, కో- అప్షన్ సభ్యులు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరుకావాలని ఆయన కోరారు.

కమ్మనపల్లె గురుకుల పాఠశాలలో టీచర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

బైరెడ్డిపల్లె, జూలై 11 : మండలంలోని కమ్మనపల్లె గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న ఫిజిక్స్, గణితం, తెలుగు టీచర్ పోస్టులకు అర్హులైనవారు ఈ నెల 15వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శోభ గురువారం ఒక ప్రకటనలో కోరారు.

తిరుమలకు తరలిన జనసేన నాయకులు

సోమల, జూలై 11: రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు నాగభూణం రాయల్ ఆధ్వర్యంలో తిరుమలకు పాదయాత్రగా వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాలకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిత్రపటాలు అందజేశారు. కైవారం మురళి, సోమశేఖర్, అభిషేక్, బాల సుబ్రమణ్యం పాల్గొన్నారు.

మెరుగైన బోధన అందించాలి


చల్లా రామచంద్రారెడ్డిని కలిసిన ఎంఈవోలు

రొంపిచెర్ల, జూలై 11: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మెరుగైన బోధన, నాణ్యమైన భోజనం అందించాలని టీడీపీ పుంగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చల్లాబాబు సూచించారు. గురువారం నియోజకవర్గంలోని పాఠశాలల నిర్వహణ, పని తీరు, పిల్లల హాజరు, మధ్యాహ్న భోజనం నిర్వహణ తదితర అంశాలపై ఎంఈవోలతో రొంపిచెర్లలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠ శాలల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఎంఈవోలు ఇందిర, శ్రీనివాసులు, తాతయ్య, శివ రత్నమ్మ, శ్రీరాములు, దామోదర్, తిరుమలమ్మ, కేశవరెడ్డి, ఈశ్వరయ్య, రెడ్డెన్నశెట్టి పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు టీడీపీ ప్రభుత్వం అండగా ఉంటుంది


జెండా ఆవిష్కరణ, కేక్ కటింగ్‌లో పాల్గొన్న యూనియన్‌నాయకులు, టీడీపీ నాయకులు

పుంగనూరు, జూలై11: ప్రజారవాణశాఖ (ఆర్టీసీ) అభివృద్ధితోబాటు కార్మికులు, ఉద్యోగులకు తెలుగుదేశం ప్రభుత్వం అండగా ఉంటుందని పుంగనూరు టీడీపీ నేత, సీనియర్ న్యాయవాది బి.వెంకటముని యాదవ్ పేర్కొన్నారు. గురువారం ఆర్టీసీ డిపో సమీపంలో ఎంప్లాయిస్ యూనియన్ 73వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు యూనియన్ జెండా ఆవిష్కరించారు. కేక్ కట్ చేశారు. యూనియన్ నాయకులు టీడీపీ నేతలను ఘనంగా సత్కరించారు. టీడీపీ మండల అధ్యక్షుడు మాధవరెడ్డి, నాయకులు విశ్రాంత డీఎస్పీ సుకుమార్, సీవీరెడ్డి, పోలీసు గిరి, దేశాధి ప్రకాశ్, సుహేల్‌బాషా, సద్దాం, కుమార్‌రాజా, గంగాధర్, ఆర్టీసీ యూనియన్ నేతలు పాల్గొన్నారు.

మైనార్టీ నిధుల గోల్‌మాల్‌పై మాజీ మంత్రిని అరెస్టు చేయాలి

పుంగనూరు , జూలై11: మైనార్టీ నిధులు రూ. 4వేల కోట్లు గోల్‌మాల్ చేసిన మాజీ మంత్రి అంజాద్‌బాషాను ప్రభుత్వం వెంటనే అరెస్ట్ చేయాలని బీజేపీ రాష్ట్ర మైనార్టీ మోర్చా నాయకుడు అయాబ్‌ఖాన్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం మైనార్టీల అభివృద్ధి కోసం ఐదేళ్లలో రూ. 15,913కోట్లు మన రాష్ట్రానికి మంజూరు చేసిందని, రాష్ట్ర ప్రభుత్వం రూ. 11324కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పిందన్నారు. మెడికల్ క్యాంపులకు రూ.100కోట్లు, స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ కోసం రూ. 400కోట్లు ఖర్చు చేసినట్లు లెక్కలు చూపడంపై ఆశ్చర్యం వేస్తోందని పేర్కొన్నారు.

భార్య పుట్టింటి నుంచి రాలేదని ఆత్మహత్య


ఉదయ్‌కిరణ్ (ఫైల్‌ఫొటో)

పలమనేరు, జూలై11 : భార్య పుట్టింటి నుంచి రాలేదని భర్త మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. పలమనేరు మండలం టి.ఒడ్డూరుకు చెందిన ఉదయ్‌కిరణ్ (22)కు ఆరు నెలల క్రితం వివాహమైంది. ఈ క్రమంలో ఆషాఢమాసం రావడంతో అతడి భార్య పుట్టింటికి వెళ్లింది. అప్పటి నుంచి మనస్తాపానికి గురైన ఉదయ్‌కిరణ్ నాలుగు రోజుల క్రితం ఇంటినుంచి వెళ్లిపోయాడు. ఈ క్రమంలో గ్రామసమీపంలోని అడవిలో ఓ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం పశువుల కాపరులు గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పలమనేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

14న ఉచిత కంటివైద్యశిబిరం

బైరెడ్డిపల్లె: స్థానిక జడ్పీఉన్నత పాఠశాలలో ఈ నెల 14వ తేదీ ఉదయం 10గంటలకు మానసక్లినిక్, పున్నమిబేకరి ఆధ్వర్యంలో చెన్నై శంకర్ నేత్రాలయ ఆస్పత్రి వైద్యులచే ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు డాక్టర్లు మురళీకృష్ణ, శ్రీనివాసులు తెలిపారు.

రూ.18 కోట్లతో గజదాడుల నివారణ, టూరిజం హబ్


గజబాధిత కుటుంబానికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, జూలై11 : పలమనేరులో ఏనుగుల దాడులను అరికట్టేందుకు, టూరిజం హబ్ ఏర్పాటుకు రూ. 18కోట్లు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నట్లు పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పేర్కొన్నారు. గురువారం పలమనేరులో ఆయన రాపిడ్ రెస్పాన్స్ టీమ్ ఎలిఫెంట్ డ్రైవ్ వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏనుగుల సమాచారం అందిన వెంటనే ఈ వాహనంలో శిక్షణ పొందిన సిబ్బంది వెళ్లి ఏనుగులను అడవిలోకి మళ్లించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. అనంతరం ఏనుగుల దాడిలో మృతిచెందిన పెద్దపంజాణి మండలం జిట్టంవారిపల్లికి చెందిన గంగయ్య కుటుంబసభ్యులకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.5 లక్షల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి చైతన్య కుమార్‌రెడ్డి, పలమనేరు ఎఫ్ఆర్‌ఓ శివన్న, ఎఫ్‌బీఓలు, ఎస్ఎఫ్ఓలు, టీడీపీ నాయకులు ఆర్బీసీకుట్టి, ఆర్వీ. బాలాజి, గిరిబాబు, నాగరాజు, సుబ్రమణ్యంగౌడు, ఖాజాపీర్, చాంద్‌బాషా, హనీఫ్, సోమశేఖర్‌గౌడు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి


వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్

కుప్పం, జూలై 11: రోగులకు మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. కుప్పం ప్రాంతీయ ప్రభుత్వ ఆస్పత్రిని కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ గురువారం సాయంత్రం తనిఖీ చేశారు. వార్డులను, ఆపరేషన్ థియేటర్లను పరిశీలించారు. అనంతరం డాక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆస్పత్రికి అవసరమైన బెడ్ షీట్స్, ఆపరేషన్‌కు కావాల్సిన వైద్య పరికరాలను ఆస్పత్రి అభివృద్ధి నిధి నుంచి కొనుగోలు చేయాలని మెడికల్ సూపరిం టెండెంట్‌ను ఆదేశించారు. ఆస్పత్రి అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేసి పంపాలన్నారు. డీసీహెచ్ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ విజయకుమారి, డాక్టర్ బీఆర్ సురేష్ బాబు, డాక్టర్లు పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మ జాతర


గంగమ్మల ఊరేగింపు

గుడుపల్లె, జూలై 11: మండల పరిధిలోని జాతికర్తనపల్లెలో గురువారం గంగమ్మ జాతర వైభవంగా ప్రారంభమైంది. గ్రామంలోని అమ్మవారి ఆలయమైన ఊరి గంగమ్మ, రెండవ వీధిలోని మారెమ్మ, దిగువ వీధిలోని కుంటి గంగమ్మ, ప్రధాన వీధిలోని బాట గంగమ్మ ఆలయాలను విద్యుత్ దీపాలు, పచ్చని తోరణాలతో అలంకరించారు. అర్చకులు అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి విశేష అలంకరణలు చేశారు. గ్రామంలోని మహిళలు పిండిదీపాలు తీసుకొని మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా అమ్మవారి ఆలయాలకు చేరుకొన్నారు. అనంతరం అమ్మ వార్లకు పొంగళ్లు పెట్టి, దీపాలు వెలిగించారు. అనంతరం జంతుబలులు సమర్పించి మొక్కులు తీర్చుకొన్నారు. వర్షాలు బాగా కురవాలని, చెరువులు నిండి పంటలు బాగా పండాలని అమ్మవార్లను ప్రజలు వేడుకున్నారు. ఊరి గంగమ్మ, మారెమ్మ, కుంటి గంగమ్మ, బాట గంగమ్మ ఉత్సవర్లను పట్టు వస్త్రాలు, ఆభరణాలు, రంగురంగుల పుష్పాలతో అలంకరించి డప్పు వాయిద్యాలతో గ్రామంలో ఊరేగించారు. అమ్మవార్లకు మహిళలు కొబ్బరికాయలు కొట్టి, హారతులు ఇచ్చి మొక్కుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారు భక్తులకు అన్నదానం చేశారు.

టమోటాకు గిట్టుబాటు ధర కల్పించాలి

పలమనేరు మార్కెట్లో రైతుల ఆందోళన


సమావేశం నిర్వహిస్తున్న కమిటీ కార్యదర్శి సంజీవకుమార్

పలమనేరు, జూలై11 : గిట్టుబాటు ధర కల్పించాలని టామోటా రైతులు పలమనేరు మార్కెట్ యార్డు కార్యాలయం ఎదుంట గురువారం ఆందోళనకు దిగారు. వెంటనే స్పందించిన యార్డు కార్యదర్శి సంజీవకుమార్ మార్కెట్‌యార్డులో రైతులు, వ్యాపారులు, మండీ యజమానులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. రైతులు మాట్లాడుతూ పొరుగునే ఉన్న కోలారు మార్కెట్‌లో టమోటా ధరలకు ఇక్కడి ధరలకు బాక్సుకు రూ.150 నుంచి 200 వరకు తేడాలున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యాపారులు, మండీ యజమానులు మాట్లాడుతూ అక్కడి రైతులు రవాణాకు వీలుగా దొరగా ఉన్న కాయలు మార్కెట్ తెస్తారని తెలియజేశారు. అంతేగాక సీడ్ టమోటాలకు ఎప్పుడూ అక్కడ అధిక ధర ఉంటుందని వివరించారు. అయితే రైతులకు మంచి ధరలు వచ్చేలా చర్యలు తీసుకుంటామని కార్యదర్శి సంజీవ కుమార్ రైతులకు హామీ ఇచ్చారు.

నేత్రపర్వంగా పుష్పపల్లకీ సేవ


పుష్పపల్లకీల్లో ఊరేగుతున్న గంగమ్మ, పోతులరాజు, సల్లాపురమ్మ

రామకుప్పం, జూలై 11: రామకుప్పం గంగజాతరలో భాగంగా బుధవారం రాత్రి పుష్పపల్లకీ సేవ నేత్రపర్వంగా జరిగింది. రాత్రి 10:30గంటలకు గంగమ్మ, పోతులరాజు, సల్లాపురమ్మ ఉత్సవమూర్తులను సర్వాలంకారశోభితమైన అశ్వరథ పుష్పపల్లకీల్లో అధిష్టింపజేశారు. మంగళవాయిద్యాలు, డప్పు లహోరు మధ్య పుష్పపల్లకీలను పట్టణవీధుల్లో ఊరేగించారు. దిగువవీధి గంగమ్మ ఆలయం నుంచి బయలు దేరిన పుష్పపల్లకీలు వైశ్యవీధి, శివాజీనగర్, ఎగువ బైపాస్‌రోడ్డు, ఆటో సర్కిల్, షాదీమహల్, పోలీస్‌స్టేషను సర్కిల్, బ్రాహ్మణవీధుల మీదుగా దిగువవీధి గంగమ్మ ఆలయం వద్దకు చేరుకున్నాయి. భక్తులు అడుగడుగునా దేవతామూర్తులకు కొబ్బరికాయలు కొట్టి కర్పూరహరతులిచ్చారు. జాతర సందర్భంగా గంగమ్మ ఆలయం వద్ద బెంగళూరుకు చెందిన కళాకారులచే నిర్వహించిన సినీగీతాల నృత్య ప్రదర్శన వీక్షకులను అలరించింది. ఈ సందర్భంగా దిగువవీధి జనసంద్రంగా మారింది.

మేపుతానంటూ ఆవులు అమ్మేశాడు

సోమల, జూలై 11: మేపుతానంటూ నమ్మించి ఆవులు తీసుకెళ్లిన వ్యక్తి వాటిని అమ్మేశాడు. ఆలస్యంగా తెలుసుకున్న యజమాని పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి కథనం మేరకు.. సోమల మండలం నెల్లిమంద పంచాయతీ బురుజుపల్లెకు చెందిన ఆంజనేయులు ఆవుల పోషణతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. మే నెలలో పశుగ్రాసం కొరత ఏర్పడింది. ఈ క్రమంలోనే రెండు నెలల క్రితం ఆంజనేయులు వద్దకు అతని సమీప బంధువు అన్నమయ్య జిల్లా చింతపర్తికి చెందిన రమణ వచ్చాడు. రూ.1.50 లక్షలు విలువ చేసే రెండు ఆవులను తమ గ్రామానికి తీసుకెళ్లి మేపుతానని నమ్మించాడు. అంజనేయలు అతడి మాటలు నమ్మి ఆవులను అప్పగించాడు. ఈక్రమంలో ఆంజనేయులు మూడు రోజుల క్రితం చింతపర్తికి వెళ్లి చూడగా ఆవులు కనిపించలేదు. కుటుంబసభ్యులను విచారించగా పొంతనలేని సమాధానం ఇచ్చారు. దీంతో గ్రామంలో విచారణ చేయగా నెలరోజుల క్రితం అమ్మేసినట్లు తెలిసింది. సోమల పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక


పుష్ప


రెడ్డిరాహుల్

శాంతిపురం/ పలమనేరు, జూలై 11: శాంతిపురం మండలం శివరామపురం ఉన్నత పాఠశాల విద్యార్థి పుష్ప ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. హెచ్ఎం కేశవ, టీచర్లు సాంబశివారెడ్డి, ప్రసన్న, యాస్మిన్ సోని, అరుణ, గిరిజా, శివాజి తదితరులు పుష్పను అభినందించారు. ● పలమనేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి రెడ్డిరాహుల్ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు హెచ్ఎం షంషీర్ తెలిపారు. పట్టణంలోని పాతపేటకు చెందిన శివశంకర్, వాసవి దంపతుల కుమారుడు రెడ్డిరాహుల్. ఇతడిని పలువురు అభినందించారు.

సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలి

పుంగనూరు రూరల్, జూలై11: గ్రామ సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించాలని పుంగనూరు మండల టీడీపీ అధ్యక్షుడు మాధవరెడ్డి, జనసేన మండల అధ్యక్షుడు విరూపాక్షి కోరారు. గురువారం మండలంలోని చదళ్ల, మోదుగులపల్లె, ఎంసీపల్లె పంచాయతీ సచివాలయాలకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చిత్రపటాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రత్నమ్మ, వెంకటరెడ్డి, గంగాధర్, శ్రీనివాసులు, జనసేన నాయకులు హరినాయక్, నరేష్‌రాయల్, చైతన్యరాయల్, బాలాజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్య అభ్యసించాలి

పుంగనూరు రూరల్, జూలై11: విద్యార్థులు ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు, సొంత ఊరికి మంచి పేరు తీసుకురావాలని పుంగనూరు టీడీపీ మైనార్టీ నాయకుడు సుహేల్‌బాషా ఆకాంక్షించారు. గురువారం స్థానిక ఉర్దూ పాఠశాలలో ఆయన విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. టీడీపీ మైనార్టీ నాయకులు అబ్బాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రహదారి నిబంధనలు పాటించాలి

పుంగనూరు రూరల్, జూలై11: పుంగనూరులో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి వాహనదారులు తప్పకుండా రహదారి నిబంధనలు పాటించాలని పుంగనూరు సీఐ జయరామయ్య తెలిపారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో పట్టణ పరిధిలోని ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డుపై ఎక్కడ పడితే అక్కడ ఆటోలు నిలపడం, పరిమితికి మించి ప్రయాణికులను తరలించడం, మద్యం సేవించి వాహనాలు నడిపరాదని సూచించారు. ద్విచక్రవాహన చోదకులు హెల్మెట్ ధరించాలన్నారు.

కొమ్మ కత్తిరింపుతో అధిక దిగుబడి

పెద్దపంజాణి, జూలై 11: మామిడిలో కొమ్మ కత్తిరింపుతో అధిక దిగుబడి సాధించవచ్చునని పెద్దపంజాణి మండల ఉద్యానవన శాఖాధికారి వరప్రసాద్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని మామిడి రైతులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడిలో మే, జూన్ నెలలో పంట కోత అనంతరం జూలై, ఆగస్టు మాసాలలో కొమ్మ కత్తిరింపు కార్యక్రమం చేపట్టాలని సూచించారు. కోసివేసిన కొమ్మలకు తెగులు రాకుండా సీవోసీ పేస్టును రాయాలన్నారు. అలాగే సీవోసీ 3గ్రాములు లీటరు నీటికి కలిపి చెట్టు మొత్తం పిచికారి చేయాలన్నారు. దీని వలన తేనె మంచుపురుగులను, తెగుళ్లను నివారించ వచ్చునన్నారు. ఆయన వెంట సిబ్బంది శ్రీనివాసులు ఉన్నారు.

మాతృ భాషలో బోధనకు కృషిచేయండి

గంగవరం, జూలై11 : పాఠశాల విద్య మాతృభాషల్లో ఉండేలా కృషి చేయాలని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావుకు తెలుగుసాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్ష కార్యదర్శులు తులసినాథంనాయుడు, పుష్ప దంపతులు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, రవి, మరళి, వినోద్, చాణుక్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసుపై విచారణ

చౌడేపల్లె, జూన్11: ఎస్సీ, ఎస్టీ కేసుపై పలమనేరు డీఎస్పీ విష్ణురఘువీర్ విచారణ చేపట్టారు. స్థానిక మేదరదొడ్డికి చెందిన రామ్మూర్తి ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలించారు. పుంగనూరు రూరల్ సీఐ కృష్ణారెడ్డి, ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

దోమల నివారణకు గంబూషియా చేపల పెంపకం

పలమనేరు, జూలై11: డెంగ్యూ వ్యాధికి ప్రధానమైన దోమలను నివారించేందుకు పలమనేరు, గంగవరం మండలాల్లోని కూర్మాయి, గొబ్బిళ్లకోటూరు, దండపల్లి, బొమ్మనపల్లి కీలపట్ల చెరువుల్లో గురువారం గంబూషియా చేపపిల్లలను వదిలి పెట్టినట్లు పలమనేరు సబ్ యూనిట్ అధికారి జయశంకర్ తెలిపారు. డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు జయశంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు మాధవి, ఉషా, ఆశ పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించాలి

పలమనేరు, జూలై11: ద్విచక్ర వాహనాలు నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరిం చాలని పలమనేరు సీనియర్ సివిల్ జడ్జి పగడాల శ్రీనివాసరావు సూచించారు. గురువారం పలమనేరులో జరిగిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. పలమనేరు బార్ అసోసియేషన్ నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో భాగంగా బసవన్నకట్ట వీధిలో హెల్మెట్‌లు ధరించాలని ర్యాలీ నిర్వహించారు. న్యాయవాదులు పరమశివప్ప, భాస్కర్, క్రిష్ణమూర్తి మొహిద్దీన్ పాల్గొన్నారు.

నేడు జూనియర్ కళాశాల ప్రారంభం

పెద్దపంజాణి, జూలై 11: పెద్దపంజాణిలో శుక్రవారం నూతనంగా ప్రభుత్వ జూనియర్ కాలేజిని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ప్రారంభించనున్నారు.

వక్ఫ్ బోర్డు నిధుల దుర్వినియోగం

● నకిలీ బ్యాంకు ఖాతాలతో దోపిడీ ● టీడీపీ నాయకుల ఫిర్యాదు
● విచారణ అధికారుల ఎదుటే వైసీపీ దాడులు


దాడుల అనంతరం విచారణ చేస్తున్న ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి

చౌడేపల్లె, జూన్11: వక్ఫ్ బోర్డు నిధుల దుర్వినియోగంపై వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ గౌస్‌మోదిన్ విచారణ చేపట్టారు. మండలంలోని దాదేపల్లె మసీదుకు సంబంధించి రూ.6.22 లక్షల వక్ఫ్ బోర్డు నిధులు దుర్వినియోగం అయ్యాయని టీడీపీ మైనార్టీ నాయకులు, మసీదు ముతవల్లీ అమిద్‌ఖాన్, గ్రామస్తులు ఈనెల 8వ తదీన జిల్లా మైనార్టీ వక్ఫ్ బోర్డు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టేందుకు వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ గౌస్‌మోదిన్ దాదేపల్లె మసీద్‌కు వచ్చారు. గ్రామస్తులు, గ్రామ పెద్దలు, ముత్తవల్లీలు, మసీద్ కమిటీ సభ్యుల సమక్షంలో విచరణ చేపట్టారు. ఆ సమయంలో వైసీపీ నాయకులు బషీర్‌సాబ్, సుల్తాన్‌సాబ్ తదితరులు తమ వర్గం వారితో కలిసి మసీదు ముతవల్లీలపై, కమిటీ సభ్యులపై దాడులు చేశారు. వారు కూడా ప్రతిదాడి చేశారు. ఇన్‌స్పెక్టర్ సమక్షంలోనే ఇరువర్గాలు దాడులు చేసుకున్నారు. ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తన సిబ్బందితో వెళ్లి దాడులను అడ్డుకున్నారు. ఈ దాడులలో పలువురు గాయపడ్డారు. వక్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ గౌస్‌మోదిన్ మాట్లాడుతూ 2019 నుంచి వక్ఫ్‌బోర్డు నుంచి మసీదు సిబ్బందికి జీతాలు, నిర్వహణకు ప్రభుతం ఇస్తున్న సొమ్ముకు నకిలీ బ్యాంక్ ఖాతా తెరచి కాజేశారని తెలియజేశారు. మసీదు సిబ్బంది పేరుతో తప్పుడు పత్రాలు సృష్టించి నగదును ఐదేళ్లుగా దోచుకున్నారని వివరించారు. నివేదికను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి దోచుకున్న సొమ్మును రికవరీ చేయనున్నట్లు తెలిపారు. కాగా వైసీపీ నాయకులు బషీర్‌సాబ్, సుల్తాన్‌సాబ్‌తో పాటు బాబ్‌జాన్, షేర్‌ఖాన్, సనావుళ్లా, రెడ్డిబాష, మషాయక్, ఫిరోజ్, మహ్మద్‌కైఫ్‌తో పాటు మరికొందరు వైసీపీ నాయకులు తనపై దాడిచేశారని ముతవల్లీ అమిద్‌ఖాన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

వీధుల్లో ఆక్రమణల తొలగింపు



చిత్తూరు, జూలై 11: అసలే ఇరుకైన వీధులు.. పైగా ఆక్రమణలు.. ఫలితంగా వాహనదారుల అవస్థలు ఇదీ చిత్తూరు నగర పరిస్థితి. మురికినీటి కాలువలను ఆక్రమించి వాటిపైనే నిర్మాణాలు చేపట్టారు. డ్రైనేజీ లు పూర్తిగా పూడిపోయి, వర్షం వస్తే మురికి నీరు రోడ్లపైకి చేరుతున్నాయి. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ సమస్య పరిష్కారంపై దృష్టి సారించారు. ముందుగా పొన్నియమ్మన్‌గుడి వీధిలో మురికి కాలువను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను తొలగిస్తున్నారు. డ్రైనేజీల్లో పూడిక తీయడం వల్ల నీరు సజావుగా పోతున్నాయి. నగరంలోని అన్ని వీధుల్లో విడతల వారీగా ఆక్రమణలను తొలగిస్తామని టౌన్ ప్లానింగ్ అధికారులు తెలిపారు.

దారి లేకుండా చేశారని ఫిర్యాదు

వెదురుకుప్పం, జూలై 11: తమ గ్రామం నుంచి గుట్టమీదఇండ్లకు వెళ్లే దారిని మూసివేశారని చెన్నుగారిపల్లె గ్రామస్తులు గురువారం ఫిర్యాదు చేశారు. పాతగుంట గ్రామ పంచాయతీ చెన్నుగారిపల్లె నుంచి గుట్టమీద ఇండ్లకు ఏళ్ల తరబడి దారి ఉంది. గురువారం గుట్టమీదఇండ్లలో నివాసం ఉండే ఒకరు దారిలేకుండా మూసివేశారని, ఈ విషయమై అడిగితే దుర్భాషలాడాడని చెన్నుగారిపల్లె రైతులు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. న్యాయం చేయాలని ఉప తహసీల్దార్ కోమలకు, పోలీసులకు వినతులు సమర్పించారు.

రుణాలను సద్వినియోగం చేసుకోండి

గుడిపాల, జూలై 11: మహిళలు సంఘాల ద్వారా పొందే రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వావలంబన పొందాలని మాజీ జడ్పీటీసీ సుమతి అన్నారు. గురువారం మండల మహిళా సంఘాల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళలు స్వశక్తితో ఎదుగుతూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారన్నారు. ఏపీఎం సుధారాణి మహిళలు తీసుకున్న రుణాలను ఏ విధంగా తిరిగి చెల్లించాలనే విషయాలను వివరించారు. అనంతరం మండల సమాఖ్యను ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా వి.కార్తి, కార్యదర్శిగా సంధ్య, కోశాధికారిగా జమున ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎంపీటీసీ విజయలక్ష్మి, మాజీ ఎంపీటీసీ సాంబశివనాయుడు, వెలుగు సీసీలు లోకనాథరెడ్డి, మల్లీశ్వరి, హేమచంద్రారెడ్డి పాల్గొన్నారు.

జీవో 117 రద్దు చేయాలి : ఏపీటీఎఫ్

చిత్తూరు (సెంట్రల్), జూలై 11: ప్రభుత్వ పాఠశాలలకు నష్టం చేకూరుస్తున్న జీవో 117ను రద్దు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం డీఈవో కార్యాలయంలో ఏడీ వెంకటేశ్వర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లను నియమించాలని, ప్రాథమిక పాఠశాలల్లో 5వ తరగతి వరకు కొనసాగించాలని కోరారు. యాప్‌ల భారం తగ్గించడంతో పాటు టీచర్ల సర్వీసును డీఎస్సీల వారీగా క్రమబద్ధీకరించాలని కోరారు. ఏపీటీఎఫ్ నాయకులు జగదీష్, అమరనాథ్, మధు, మునీర్ పాల్గొన్నారు.

అక్రమ మద్యం ధ్వంసం

చిత్తూరు, జూలై 11 : చిత్తూరు వన్‌టౌన్ పరిధిలో పట్టుబడిన అక్రమ కర్ణాటక మద్యాన్ని గురువారం పోలీసులు ధ్వంసం చేశారు. 1,341.24 లీటర్ల కర్ణాటక మద్యం, టెట్రా ప్యాకెట్లను సెబ్ సూపరింటెండెంట్ శ్రీధర్‌రావు, సెబ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రవి, వన్‌టౌన్ సీఐ విశ్వనాథరెడ్డి పర్యవేక్షణలో రెడ్డిగుంట వద్ద ఖాళీ ప్రదేశంలో ధ్వంసం చేశారు.

ఏపీపీడీటీఆర్‌టీసీ ఆవిర్భావ దినోత్సవం

చిత్తూరు రూరల్, జూలై 11: ఏపీపీడీటీఆర్‌టీసీ ఆవిర్భావ దినోత్సవాన్ని యూనియన్ నాయకులు గురువారం ఆర్టీసీ బస్టాండ్‌లో ఘనంగా నిర్వహించారు. కార్మిక, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం యూనియన్ ఆవిర్భవించిందని తెలిపారు. అనంతరం ఎర్రజెండాను ఆవిష్కరించారు. నాయకులు నాగరాజు, చంద్ర, దేవరాజులు, రమాదేవి పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం పెట్టాలి

పూతలపట్టు, జూలై 11: హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్న పేద విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని ఎంపీడీవో ప్రసన్నకుమారి కోరారు. గురువారం ఆమె మండల పరిధిలోని పి. కొత్తకోట బాలుర వసతిగృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంట గదులను, వసతిగృహాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులను సొంత బిడ్డల్లాగా చూసుకుని, వారు చదువులో రాణించేలా చూడాలన్నారు.

దోమల కట్టడికి గంబూసియా చేపలు

చిత్తూరు, జూలై 11: స్టాప్ డయేరియా కాంపెయిన్‌లో భాగంగా దోమల లార్వాల నియంత్రణకు కాల్వలు, చెరువులు, కుంటల్లో గంబూసియా చేప పిల్లలను వదిలారు. నగర పాలక సంస్థ పరిధిలోని కట్టమంచి చెరువు, గంగినేని చెరువు, దుర్గానగర్‌కాలనీ చెరువు, ప్రశాంత్‌నగర్, వైఎస్సార్ నగర్, కొంగారెడ్డిపల్లెలోని నీటి నిల్వ ప్రాంతాల్లో గురువారం లక్షకు పైగా చేపపిల్లలను వదిలినట్లు అధికారులు తెలిపారు. ఈ చేపలు నీటిలోని దోమలను మాత్రమే తిని బతుకుతాయి. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌వో అనిల్‌కుమార్ నాయక్, అసిస్టెంట్ మలేరియా అధికారి చంద్రారెడ్డి పాల్గొన్నారు.

కంటివైద్య శిబిరానికి విశేష స్పందన

పాలసముద్రం, జూలై 11: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం చెన్నైకి చెందిన ఎం.ఎన్.కంటి ఆస్పత్రి డాక్టర్లు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కంటి సమస్యలున్న 56 మంది రోగులకు పరీక్షలు చేసి, 26 మందిని శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు. అవసరమైన వారికి అద్దాలు, మందులు ఇచ్చారు. కంటి వైద్యులు డాక్టర్ అబ్బాస్, డాక్టర్ ప్రిన్స్, డాక్టర్ మోహన్ కృష్ణ పాల్గొన్నారు.

స్థానిక సంస్థలకు నిధుల విడుదలపై హర్షం

విజయపురం, జూలై 11: స్థానిక సంస్థలకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.250 కోట్లు విడుదల చేయడంపై ఉమ్మడి జిల్లా పంచాయతీ రాజ్ చాంబర్ అధ్యక్షుడు చుక్కా ధనుంజయయాదవ్ హర్షం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఈ నిధుల కోసం ఎన్నో ఉద్యమాలు చేసినా స్పందన లేదన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన కొన్ని రోజుల్లోనే పంచాయతీరాజ్ వ్యవస్థను పటిష్ఠం చేయడానికి చర్యలు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు.

టీడీపీ నేత మృతికి సంతాపం

నగరి జూలై11: టీడీపీ మైనారిటీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి ఖాదర్‌భాయ్‌కు నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ నివాళులర్పించారు. గురువారం మధ్యాహ్నం గుండెపోటుతో మృతిచెందిన ఖాదర్‌భాయ్ భౌతిక కాయాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఖాదర్‌భాయ్ మృతి పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. పార్టీ చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి చినబాబు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి బాలాజీ, పట్టణాధ్యక్షుడు రమేష్‌బాబు, అల్లిముత్తు, సలీమ్ పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

గుడిపాల, జూలై 11: మండలంలోని చిత్తూరు-వేలూరు జాతీయ రహదారిలోని కిలారిపల్లి వద్ద వారం రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. నాలుగు రోజుల క్రితం ఏలుమలై మృతిచెందగా, గురువారం తమిళనాడుకు చెందిన మహదేవన్ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు.

వ్యాన్ ఢీకొని గాయాలు

గుడిపాల, జూలై 11: చిత్తూరు-వేలూరు జాతీయ రహదారిలోని గుడిపాల బస్టాప్ వద్ద వ్యాన్ ఢీకొనడంతో అనుపు ఎస్టీ కాలనీకి చెందిన వెంకటేష్ తలకు తీవ్ర గాయమైంది. చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



గాయపడిన వెంకటేష్

అడ్డదిడ్డంగా ఆటోలు..జనానికి అవస్థలు





రోడ్లపై అడ్డదిడ్డంగా నిలిపి ఉంచిన ఆటోలు

చిత్తూరు, జూలై 11: ఇరుకు రోడ్లు... అడ్డదిడ్డంగా తిరిగే ఆటోలతో చిత్తూరు ప్రజలు రోడ్లపై స్వేచ్ఛగా తిరగలేని పరిస్థితి నెలకొంది. నగరంతోపాటు చుట్టుపక్కల మండలాల నుంచి వచ్చే వాటితో కలిసి వెయ్యికి పైగా ఆటోలున్నాయి. నగరంలో తిరిగే ఆటోలకు కొన్నిచోట్ల మాత్రమే స్టాండ్లు ఉన్నాయి. మిగిలిన చోట్ల రోడ్డపై ఎక్కడపడితే అక్కడ నిలిపేస్తున్నారు. దీంతో బస్సులతో పాటు కార్లలో వచ్చేవారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రధానంగా గాంధీ సర్కిల్, ఎంఎస్ఆర్‌సర్కిల్, గిరింపేట, సంతపేట, మార్కెట్‌చౌక్, చర్చివీధి, బజారు వీధుల్లో ఆటోల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఈ ప్రాంతాల్లో ఆటోల వల్ల ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గాంధీ విగ్రహం కూడలికి నాలుగు వైపులా రోడ్లపైనే ఆటోలను నిలిపేయడం వల్ల ఉదయం, సాయంత్రం సమయాల్లో ట్రాఫిక్ మరింత జటిలమవుతోంది. నిత్యం రద్దీగా ఉండే మార్కెట్ వీధిలో ఇదే పరిస్థితి నెలకొంది. వీఐపీలు వచ్చినప్పుడు తప్పా మిగతా సమయాల్లో ట్రాఫిక్ పోలీసులు కనిపించడం లేదు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ముందే ఆటోలను నిలిపేసినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు ఆటోలకు ప్రత్యేకంగా స్టాండ్లను ఏర్పాటు చేసి, సమస్యకు పరిష్కారం చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

'డయల్ యువర్ ఎమ్మెల్యే'కు 39 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు, జూలై 11: నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం నిర్వహించిన డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమానికి 39 ఫిర్యాదులు వచ్చాయి. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఉదయం 10 నుంచి 11 గంటల వరకు కమిషనర్ అరుణతో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్ ఆయనే స్వయంగా మాట్లాడి సమస్యలను నమోదు చేసుకున్నారు. ఫిర్యాదుల్లో పోలీసు శాఖకు 7, రెవెన్యూకు 4, నేషనల్ హైవేకు 1, ట్రాన్స్‌కోకు 1, పంచాయతీరాజ్‌కు 1, సీఎం సహాయనిధికి 5 వచ్చాయి. అనంతరం ఆయన అధికారులతో సమావేశమై అందిన సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, సీఐ విశ్వనాథరెడ్డి, గుడిపాల, అధికారులు పాల్గొన్నారు.

పూతలపట్టులో ఐటీ టవర్స్ ఏర్పాటు చేయమని కోరాం



ఆలయం ముందు ఎమ్మెల్యే మురళీ మోహన్

తిరుమల, జూలై11(ఆంధ్రజ్యోతి): హైవేలతో పాటు ఎయిర్ పోర్టులతో కనెక్టివిటీ ఉన్న ప్రాంతం కావడంతో పూతలపట్టు లో ఐటీ టవర్స్ వర్క్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని మంత్రి నారా లోకేశ్‌ను కోరామని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ తెలిపారు. మంత్రి కూడా సానుకూలంగా స్పందిస్తూ సంబంధిత ప్రపోజల్స్ ఇవ్వాలని ఆదేశించినట్టు తెలిపారు. తిరుమల శ్రీవారిని గురువారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. పూతలపట్టు నియోజక వర్గంలో యువతకు ఉపాధి అవకాశాల కోసం పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. కాణిపాకం దేవస్థానంలో కూడా తిరుమల తరహాలో మాస్టర్‌ప్లాన్ అమలుచేసి వేలాది మంది భక్తులకు అసరమయ్యే సౌకర్యాలను కల్పిస్తామన్నారు.

చాతుర్మాస మహాయోగ మహోత్సవం ప్రారంభం



మహోత్సవంలో పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

బంగారుపాళ్యం, జూలై 11: మండలంలోని మొగిలిలో వెలసిన శివపార్వతుల గోశాల దేవరకొండలో గురువారం చిత్తూరు జిల్లా బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో చాతుర్మాస మహాయోగ మహోత్సవం ప్రారంభమైంది. ప్రత్యేక హోమాలు, గోపూజ, గణపతి పూజ, స్వస్తివచనం, మంట పారాధన, మహాగణపతి హోమం, నవగ్రహ హోమం, మృత్యుంజయ హోమాలు నిర్వహించారు. లోక కల్యాణార్థం ఈనెల 15వ తేదీవరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పలమనేరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు అమరనాథరెడ్డి, మురళీమోహన్, టీడీపీ మండలాధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్, మాజీ ఎంపీపీ సుచిత్ర, కమల్‌నాథరెడ్డి, కొండేటి శివ, హేమచంద్ర నాయుడు, రమేష్, మంజు, ధనంజయ నాయుడు పాల్గొన్నారు.

ఇంటికి దారివ్వలేదని గుంత తవ్వేశాడు

చిత్తూరు సిటీ, జూలై11: ఇంటికి దారివ్వలేదని తమ ఇంటిముందు ఓ హోంగార్డు గుంత తవ్వేశాడని గిరింపేట భరత్ నగర్‌కు చెందిన నరసింహులు శెట్టి ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ హోంగార్డు ఎంసీ రాజన్ ఇంటికి దారి ఇవ్వలేదనే కక్షతో తమ ఇంటి ముందు రోడ్డులో గుంత తవ్వేశాడని, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలిపారు. అంతేగాకుండా తాము అక్రమంగా నీటి కొళాయి కనెక్షన్ తీసుకున్నామని తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

పోటీ ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం కీలకం


కార్వేటినగరం, జూలై 11: పోటీ ప్రపంచంలో విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అవసరమని, అధ్యాపకులు ఆ దిశగా బోధన చేయాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విజయులు రెడ్డి తెలిపారు. గురువారం కళాశాలలో పనిచేస్తున్న కంప్యూటర్స్ అతిథి అధ్యాపకురాలు లావణ్య బదిలీ కావడంతో ఆమెను ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలకు నాక్ గుర్తింపు సమయంలో, విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం అందించడంలో లావణ్య చేసిన కృషి అనిర్వచనీయమని కొనియాడారు.

వివాదాస్పద పాఠశాల స్థలం పరిశీలన



తవణంపల్లె, జూలై 11: మండలం లోని వెంగంపల్లె జడ్పీ ఉన్నత పాఠశా లకు చెందిన వివాదాస్పద స్థలాన్ని చిత్తూరు డీఆర్వో పుల్లయ్య గురువారం పరిశీలించారు. వెంగంపల్లె పాఠశాలకు అదే గ్రామానికి చెందిన దొరస్వామిరెడ్డి 30 సెంట్లు భూమిని అందజేశారు. అయితే ఆ భూమిని పాఠశాలకు స్వాధీనం చేయకుండా తానే అనుభవిస్తుండడం వివాదానికి దారితీసింది. గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేయగా డీఆర్వో తవణంపల్లె తహసీల్దార్ అరుణకుమారితో కలిసి భూమికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. భూమి పాఠశాలకు చెందుతుందని తేల్చారు. అయితే దీనికి ప్రత్యామ్నాయంగా భూమి కేటాయించాలని దొరస్వామిరెడ్డి డీఆర్వో దృష్టికి తీసుకురాగా పరిశీలిస్తామన్నారు.

కవితా లాహిరి పుస్తకావిష్కరణ



చిత్తూరు కల్చరల్, జూలై11: గ్రంథాలయ విశ్రాంత ఉద్యోగి, అభ్యు దయ రచయిత జి.విజయ్‌కుమార్ రచిం చిన కవితా లాహిరి పుస్తకాన్ని గురు వారం చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ తన నివాసంలో

ట్రిపుల్ ఐటీకి ఎంపిక



ఐరాల, జూలై 11: మండలంలోని పుత్రమద్ది జడ్పీ హైస్కూల్‌కు చెందిన రోహిత్ ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు హెచ్‌ఎం లక్ష్మణ్‌బాబు గురువారం తెలిపారు. గురువారం విడుదలైన ఫలితాల్లో 575 మార్కులతో మండల స్థాయిలో రెండవ ర్యాంకు సాధించాడని చెప్పారు. రోహిత్‌ను సన్మానించారు.

జంబాడ విద్యార్థి..



విజయపురం : మండలంలోని జంబాడ ఉన్నత పాఠశాల విద్యార్థిని ద్రాక్షాయణి ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. ఆమెను హెచ్‌ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు అభినందించారు. విద్యాకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పాలసముద్రం ఉన్నత పాఠశాలలో ఇద్దరు..



వల్లి - అశ్విత

పాలసముద్రం : మండలంలోని పాలసముద్రం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ఆర్కే వల్లి, ఎస్.ఆర్.కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన ఎస్.అశ్రిత ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఎంఈవో రాజేంద్రప్రసాద్ తెలిపారు. తమ పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థినులు ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడం పట్ల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

కడప ఆర్జేడీకి అభినందనలు



చిత్తూరు (సెంట్రల్), జూలై 11: విద్యాశాఖ కడప రీజినల్ జాయింట్ డైరెక్టర్‌గా నియమితులైన శామ్యూల్‌ను తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రజినిబాబు, జిల్లా అధ్యక్షుడు మధు గురువారం కడపలో కలసి అభినందనలు తెలిపారు. విద్యారంగంలోని సమస్యలను పరిష్కరించాలని కోరారు. జీవో 117 రద్దు చేయడం ద్వారా ప్రాథమిక పాఠశాలల వ్యవస్థ బలోపేతమవుతుందన్నారు. అనంతరం టీఎన్‌యూఎస్ ముద్రించిన క్యాలెండర్‌ను ఆర్జేడీ ఆవిష్కరించారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి ధనంజయ్, జిల్లా కార్యదర్శి హరి పాల్గొన్నారు.

డీఈవో తనిఖీలు

కార్వేటినగరం, జూలై 11: స్థానిక జడ్పీ బాలికల హైస్కూల్లో జిల్లా విద్యాశాఖాధికారి దేవరాజులు గురువారం తనిఖీలు చేశారు. విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేశారు. విద్యా ప్రమాణాల పెంపునకు అంకితభావంతో పనిచేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

వైభవంగా కైపాకం గంగ జాతర



నింద్ర, జూలై 11: మండలంలోని కైపాకంలో గురువారం గంగ జాతర వైభవంగా నిర్వహించారు. బుధవారం రాత్రి అమ్మవారిని వివిధ పుష్పాలతో అలంకరించి పుర వీధులలో ఊరేగింపుగా తీసువెళ్లి నడివీధిలో ప్రతిష్ఠించారు. గురువారం చుట్టు పక్కల గ్రామాల వారు వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం గ్రామ పొలిమేరల్లో అమ్మవారిని నిమజ్జనం చేశారు. ఎస్ఐ రామచంద్ర బందోబస్తు ఏర్పాటు చేశారు.

బృందావనంలో పారిశుధ్య పనులు

పాలసముద్రం, జూలై 11: మండలంలోని ఎస్ఆర్ఆర్ కండిగ బృందావనంలో గురువారం పారిశుధ్య పనులు చేపట్టారు. పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వం వేతనాలు చెల్లించకపోవడంతో కొన్ని నెలలుగా వారు చెత్త నుంచి సంపద సృష్టించే పనులు మానుకున్నారు. దీంతో బృందావనంలో పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. పంచాయతీ అధికారులు స్పందించి గురువారం పారిశుధ్య కార్మికులను పిలిపించి బృందావనాన్ని శుభ్రం చేయించారు. గ్రామాల్లో చెత్తను సేకరించి ఎరువులు తయారు చేస్తామని ఈవోపీఆర్డీ రమేష్, పంచాయతీ కార్యదర్శి సుధాకర్ తెలిపారు.

ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి, డీఆర్వో పుల్లయ్య

చిత్తూరు రూరల్, జూలై 11: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చిత్తూరు ప్రభుత్వాస్పత్రి నుంచి అవగాహన ర్యాలీని డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి, డీఆర్వో పుల్లయ్య జెండా ఊపి ప్రారంభించారు. గాంధీ విగ్రహం వరకు ర్యాలీ సాగింది. వారు మాట్లాడుతూ జనాభాలో భారత్ మొదటి స్థానంలో ఉందన్నారు. దేశంలో వనరులతో పోల్చుకుంటే జనాభానే అధికంగా ఉందని, అందుకే నియంత్రించాల్సిన అవశ్యకత ఉందని అన్నారు. మేయర్ అముద, జిల్లా టీబీ నివారణ అధికారి వెంకటప్రసాద్, ఆర్ఎంవో సంధ్య, ఎపిడమాలజిస్ట్ శ్రీవాణి, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

గుడిపాల : వైద్యాధికారిణి సంధ్య, జిల్లా మలేరియా యూనిట్ అధికారి పీర్‌సాహెబ్ ఆధ్వర్యంలో గుడిపాలలో ర్యాలీ నిర్వహించారు. బంగారక్క చెరువులో గంబూసియా చేప పిల్లలను వదిలిపెట్టారు. వైద్యాధికారులు చంద్ర, మహేష్, విజయ, జబశెల్వి, ఉమ, సుజుమ, స్వప్న పాల్గొన్నారు.

బంగారుపాళ్యం : మండల కేంద్రంలోని జాతీయ రహదారిలో మండల వైద్యాధికారి డాక్టర్ లోహిత్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ముంగరమడుగు చెరువు, తగ్గువారిపల్లె కుంటల్లో దోమల నివారణకు గంబూషియా చేపపిల్లలను వదిలిపెట్టారు. డాక్టర్ సెల్వరాజ్, సూపర్‌వైజర్ అముద, హరికృష్ణ, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలసముద్రం : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ మోహన కృష్ణ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది పెరిగిపోతున్న జనాభాను నియంత్రించాలంటూ పోస్టర్లను ఆవిష్కరించారు. బీసీ కాలనీ వరకు ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌వో జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ మురళి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

యాదమరి : పీహెచ్‌సీ వద్ద సీహెచ్‌వో లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ వీధుల్లో నినాదాలు చేశారు.

కార్వేటినగరం : డిఎంపురం జడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు అధిక జనాభా వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.